
తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం-27- ఏప్రిల్ 2025 | సంపుటి : 2 | సంచిక : 337 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# బోర్డర్‌లో ఉద్రిక్తం

**న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):**

పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాలతో భారత్ పాక్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించి విచ్చలవిడిగా కాల్పులకు తెగబడుతుండటం, ప్రతిగా కాల్పులతో భారత దళాలు దీటుగా సమాధానం ఇస్తుండటంతో.. ఎప్పుడేం జరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. సరిహద్దులకు సమీపంలోని గ్రామాల ప్రజలు ముందు జాగ్రత్త చర్యగా బంకర్లలోకి వెళ్లి తలదాచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మిగతా 2లో..



## నేను పాక్ వెళ్లను.. ఇక్కడే ఉంటా

**న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):**



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో మన దేశంలో నివాసం ఉంటున్న పాక్ జాతీయులు తక్షణమే భారత్ వీడాలని.. ఇరు దేశాల మధ్య రాకపోకలు ఉండవని కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలు సరిహద్దులు చెరిపేసి, జీవితాలను ముడి వేసుకొన్న.. వేసుకోబోతున్న జంటలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆన్‌లైన్ గేమ్ ద్వారా పరిచయం ఏర్పడి..

మిగతా 2లో..




# రాజకీయాల్లోకి కొత్త జనరేషన్ రావాలి

- భారత్ సదస్సులో ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- మీ నైపుణ్యాలను మాతో పంచుకోండి
- ప్రపంచానికి చాటండి
- 'తెలంగాణ రైజింగ్' బ్రాండ్ అంబాసిడర్లుగా రాష్ట్ర గొప్పతనాన్ని

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచవ్యాప్తంగా రాజకీయాల్లో ప్రాథమికంగా మార్పు వచ్చిందని.. దశాబ్దం క్రితం వర్తించిన నియమాలు ఇప్పుడు ఏమాత్రం పనిచేయడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. డబ్బు, మీడియా గుత్తాధిపత్యం పెరిగిందని.. ఇది మొత్తం రాజకీయాల స్వభావాన్నే మార్చేసిందన్నారు. ప్రపంచాన్ని ప్రేమ, ఆప్యాయత, సానుభూతి అనే దృక్కోణంలో చూసేలా రాజకీయాలు మారాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాజకీయాల్లో కొత్త నాయకత్వం నిర్మితం కావాల్సిన అవసరముందన్నారు.

మిగతా 2లో..



# ఐదు రోజులుగా కూంబింగ్

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు ఆపరేషన్ కొనసాగుతోంది. ఐదో రోజు కూంబింగ్‌లో భాగంగా మావోయిస్టులకు భారీ షాక్ తగిలింది. భద్రతా బలగాల ఆపరేషన్‌లో ఛత్తీస్‌గఢ్‌వైపు భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు తెలుస్తోంది.

వివరాల ప్రకారం.. కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు దూసుకెళ్తున్నాయి. ఐదో రోజులుగా కూంబింగ్ కొనసాగుతోంది. బలగాలకు దిశానిర్దేశం చేస్తూ గగనతలంలో హెలికాప్టర్లు, డ్రోన్లు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో శనివారం దాడుల్లో భాగంగా 38 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు సమాచారం. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.



ఇదిలా ఉండగా.. శుక్రవారం తుపాకులు, బాంబుల శబ్దాలు మారుమోగాయి. ఉదయం ఏడు గంటల నుంచే నాలుగు వైమానిక దళ హెలికాప్టర్లు చక్కర్లు కొట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. గత రాత్రి 10 గంటల వరకు భారీ కాల్పులు, బాంబు పేలుళ్ల శబ్దాలు వినిపించాయని అన్నారు. దీంతో, సమీప గ్రామాల ప్రజల్లో ఆందోళన చెందుతున్నారు.

మిగతా 2లో..

## ఐరాస బలహీన సంస్థలా మారింది: ఉత్తమ్

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

ఐక్యరాజ్యసమితి బలహీనమైన సంస్థలా మారిందని, కొన్నేళ్లుగా అనేక దేశాల మధ్య సంఘర్షణలు, యుద్ధాలు జరుగుతున్నా నివారించడంలో విఫలమైందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. భారత్ సమ్మిట్‌లో భాగంగా 'బహుళ ధ్రువ ప్రపంచంలో శాంతిన్యాయం' అనే అంశంపై శనివారం జరిగిన చర్చాగోష్ఠిలో

మిగతా 2లో..




## మహిళా సంఘాలకు ప్రోత్సాహకాలు

- పుస్తక రూపంలో వాళ్ల సక్సెస్ స్టోరీలు ఇవ్వాలి
- జనజీవనంలోకి వచ్చిన తర్వాతే నా చదువు కొనసాగింపు: సీతక్క

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల ప్రోత్సాహకాలు అందిస్తోందని మంత్రి సీతక్క తెలిపారు.

మహిళా సంఘాల సక్సెస్ స్టోరీలను పుస్తక రూపంలో ఇవ్వడం ద్వారా ఇతరులకు స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. భారత్ సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులను వెంటపెట్టుకుని శనివారం రాత్రి శిల్పారామంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌ను మంత్రి సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుమ్మరి చక్రంపై కుండ తయారీ చేయగా.. వృత్తిదారుకు చెందిన బాలిక కుండ తయారీలో మంత్రికి మెళకువలు నేర్పించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ చదువును నిర్లక్ష్యం చేయకుండా మంచిగా చదువుకోవాలని బాలికకు సూచించారు.

మహిళా సంఘానికి చెందిన రాధ తన జీవిత స్టోరీని పరిచయం చేయడం సంతోషంగా ఉందని, ఆమె ఐకేపీ సెంటర్ నడుపుకొంటూ చదువుకోవాలనుకోవడం అభినందనీయమన్నారు.

మిగతా 2లో..

## లీవ్ ఇండియా పేరుతో నోటీసులు: తెలంగాణ డీజీపీ

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు పాకిస్తానీలను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలంగాణ డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. 'సాక్షి' తో మాట్లాడిన డీజీపీ జితేందర్.. తెలంగాణలో 230 మంది పాకిస్తానీయులు ఉన్నారు. వీరిలో 199 మంది లాంగ్ టర్మ్ వీసాలు కలిగి ఉన్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో ఈ లాంగ్ టర్మ్ వీసాలు ఉన్నవారి జోలికి వెళ్లట్లేదు. మిగిలిన 31 మందికి షార్ట్ టర్మ్ వీసాలు ఉన్నాయి. ఈ షార్ట్ టర్మ్ వీసాలు కలిగి ఉన్న వారిని గుర్తిస్తున్నాము.

లీవ్ ఇండియా పేరుతో ఇప్పటికే కొంతమందికి నోటీసులు ఇచ్చాము. హెల్త్ బేస్ మీద వీసాలు తీసుకున్న వారికి ఈ నెల 29 వరకు టైం ఉంది.


మిగతా 2లో..

## గులాబీ రజతోత్సవ సంబురం

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2001లో ఆవిర్భవించి.. 13 ఏళ్లు ఉద్యమ పార్టీగా.. తొమ్మిదిన్నరేళ్లు అధికార పార్టీగా.. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీగా భిన్న పాత్రలు పోషిస్తున్న భారత రాష్ట్ర సమితి (భారాస) రజతోత్సవ సంబరానికి సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస)గా మొగ్గ తొడిగిన పార్టీ.. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడగానే తొలి ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చింది.

ఎనిమిదేళ్ల తర్వాత జాతీయస్థాయిలో విస్తరించాలనే లక్ష్యంతో 2022లో 'భారాస'గా రూపాంతరం చెంది.. ఇప్పుడు రజతోత్సవ సభ ద్వారా తిరిగి సత్తా చాటేందుకు సన్నద్ధమైంది. పార్టీ అధినేత



కేసీఆర్ ఆదివారం సాయంత్రం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగసభలో ప్రసంగించడం ద్వారా కార్యకర్తలను తిరిగి కార్యోన్ముఖులను చేయనున్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బోర్డర్‌లో ఉద్రిక్తం

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు ఉగ్రవాదుల జాడ కోసం భద్రతా బలగాలు వివిధ ప్రాంతాలు జల్లెడ పడుతున్నాయి. ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేత కొనసాగుతోంది.

**విచ్చలవిడిగా పాక్ సైన్యం కాల్పులు..**

పాక్ సైన్యం నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) పొడవునా ఉన్న ఔట్‌పోస్టుల నుంచి ఎలాంటి హెచ్చరికలూ లేకుండానే.. కాల్పులు జరుపుతోందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. పహల్‌గామ్ ఘటన తర్వాత ఈ నెల 24న రాత్రి తొలిసారిగా పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించిందని.. తర్వాత అడపాదడపా కాల్పులు జరుపుతూనే ఉందని, శుక్రవారం రాత్రంతా కూడా ఇది కొనసాగిందని తెలిపాయి. పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించిన సమయంలో.. తలదాచుకునేందుకు భారత ప్రభుత్వం సరిహద్దు గ్రామాల్లో 18 వేలకుపైగా వ్యక్తిగత, సామూహిక బంకర్లను నిర్మించింది. కొన్నేళ్లుగా సరిహద్దుల వెంట కాల్పుల ఘటనలు లేకపోవడంతో వాటిని వినియోగించలేదు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు, పాక్ దళాల కాల్పుల నేపథ్యంలో... ఆ బంకర్లను శుభ్రం చేసి, తల దాచుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. "ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అందుకే అండర్‌గ్రౌండ్ బంకర్లను సిద్ధం చేసి పెట్టుకుంటున్నాం. మా గ్రామంలో గోధుమ పండిస్తున్నాం. దిగుబడి రావడానికి ఇంకా కొన్ని రోజులు పడుతుంది. అయినా ముందే పంట కోతలు చేపడుతున్నారు. మగవాళ్లంతా ఆ పనుల్లో ఉంటే.. ఆడవాళ్లంతా బంకర్లను శుభ్రం చేసే పనుల్లో ఉన్నారు" అని ఆర్‌ఎస్ పుర సెక్టార్‌లోని ట్రెవా గ్రామ మాజీ సర్పంచ్ బల్బీర్ కౌర్ చెప్పారు.

**మరో ముగ్గురు ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేత**

ఉగ్రవాద నిర్మూలన దిశగా కీలక చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేతను కొనసాగిస్తోంది. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ఆసిఫ్ షేక్, ఆదిల్ తోకర్‌ల ఇళ్లను శుక్రవారం పేల్చేసిన భద్రతా బలగాలు.. శనివారం మరో ముగ్గురు ఉగ్రవాదులు అహ్సాన్ షేక్, షాహిద్ కుట్టీ, జాహిద్ అహ్మద్‌ల ఇళ్లను కూల్చేశాయి. ఇందులో పుల్వామాకు చెందిన లష్కరే తాయిబా ఉగ్రవాది అహ్సాన్‌కుపహల్గాం దాడితో సంబంధం ఉన్నట్టు గుర్తించారు. ఇక, షోపియాన్ ప్రాంతానికి చెందిన షాహిద్, కుల్గాంకు చెందిన జాహిద్ ఇద్దరూ గత మూడు, నాలుగేళ్లుగా దేశద్రోహ చర్యల్లో పాలుపంచుకుంటున్నట్టు తేల్చారు. దీనిపై జమ్మూకశ్మీర్ సీనియర్ అధికారి ఒకరు స్పందిస్తూ.. "స్థానికులు పాక్ ఉగ్రవాదులకు సాయం చేయడం, ఉగ్రవాదులుగా మారడాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టక తప్పడం లేదు. ఉగ్రవాదులుగా మారిన వారి కుటుంబాలు కూడా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాలేవీ అందవని స్థానిక యువతకు స్పష్టం చేస్తున్నాం. ఇళ్ల కూల్చివేత కూడా ఆ దిశగా ఇస్తున్న సంకేతాలే.." అని పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉండగా, పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులను వేటాడేందుకు భద్రతా బలగాలు జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా అడుగడుగూ జల్లెడపడుతున్నాయి. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లా తొకర్‌పొర ప్రాంతంలో ఉగ్రవాదుల అనుచరులు ఇద్దరిని భద్రతా దళాలు గుర్తించి, అదుపులోకి తీసుకున్నాయి. అయితే వారి వివరాలను బయటికి వెల్లడించలేదు. మరోవైపు కుప్వారా జిల్లాలోని సెదోరి నల అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల ఆయుధాల డంప్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు గుర్తించారు.

**పహల్గాం కేసు ఎన్ఐఏ చేతికి..**

పహల్గాం ఉగ్రదాడి కేసు అధికారికంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పరిధిలోకి వెళ్లింది. ఘటన జరిగిన వెంటనే జమ్మూకశ్మీర్ స్థానిక పోలీసులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఘటన వివరాలు, పూర్వాపరాలను సేకరించి కేసు డైరీని సిద్ధం చేశారు. తాజా వీటన్నింటినీ అధికారికంగా ఎన్ఐఏకు అప్పగించారు. నిజానికి దేశంలో ఉగ్రవాద కేసుల దర్యాప్తు ఎన్ఐఏ ఆధ్వర్యంలోనే సాగుతుంది. పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కూడా ఎన్ఐఏ అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. శనివారం ఒడిశాలోని ఇషాని గ్రామానికి చేరుకుని.. ఉగ్రదాడిలో మృతి చెందిన ప్రశాంత్ సత్పతి భార్య ప్రియదర్శిని నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. కోల్‌కతాకు చెందిన ఇద్దరు మృతుల కుటుంబ సభ్యులను కూడా కలసి వాంగ్మూలాలు నమోదు చేశారు.

**గొంతు కోస్తాం.. పాక్ ఆర్మీ అధికారి హెచ్చరిక సంజ్ఞ!**

పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ ఎదుట నిరసన తెలుపుతున్న భారతీయులకు పాక్ ఆర్మీ అధికారి చేసిన హెచ్చరిక సంజ్ఞ కలకలం రేపుతోంది. భారత సంతతివారితోపాటు ఇజ్రాయెలీలు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. పాక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమయంలో పాక్ హైకమిషన్‌లో సైనిక, వైమానిక దళాల సలహాదారుగా ఉన్న కల్నల్ తైమూర్ రాహత్ బాల్కనీలోకి వచ్చారు. 2019 భారత యుద్ధవిమానం కూలిపోయి.. ఎల్‌వోసీ అవతల పాకిస్థాన్‌కు చిక్కిన ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అభినందన్ చిత్రాన్ని పట్టుకుని రెచ్చగొట్టేలా వ్యవహరించారు. నిరసనకారులకు వేలు చూపిస్తూ.. గొంతు కోస్తామన్నట్టుగా సంజ్ఞ చేశారు. అంతేకాదు నిరసనకారుల నినాదాలు వినిపించకుండా లౌడ్ స్పీకర్లు పెట్టి పెద్ద ధ్వనితో పాకిస్థాన్ దేశభక్తి గీతాలను ప్లే చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# నేను పాక్ వెళ్లను.. ఇక్కడే ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నొయిడాకు చెందిన సచిన్ మీనాతో కలిసి జీవితం పంచుకునేందుకు 2023లో పాకిస్థాన్ వీడి వచ్చేసిన సీమా హైదర్ అప్పట్లో కొన్ని రోజులపాటు వార్తల్లో నిలిచారు.

**తాజా పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు మళ్లీ ఆమె వార్తల్లోకి వచ్చారు.**

"నేను పాకిస్థాన్ కుమార్తెనైనా ఇపుడు భారత్‌కు కోడలిని. మళ్లీ పాక్‌కు వెళ్లే ఉద్దేశం లేదు. నన్ను భారత్‌లోనే ఉండనివ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు విజ్ఞప్తి చేస్తున్నా" అంటూ సీమా కోరుతున్న వీడియో ఒకటి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. సచిన్‌ను పెళ్లాడాక తాను హిందూయిజం స్వీకరించినట్లు కూడా ఆమె తెలిపారు. "సీమా భారతీయుణ్ని పెళ్లాడి, ఇటీవలే భారతీ మీనా అనే కుమార్తెకు జన్మ కూడా ఇచ్చింది. కేంద్రం మార్గదర్శకాలు తనకు వర్తిస్తాయని అనుకోను" అని ఆమె తరపు న్యాయవాది ఎ.పి.సింగ్ తెలిపారు.

# ఐరాస బలహీన సంస్థలా మారింది: ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ అయిన ఐరాస శాంతి కోసం సరైన చర్యలు తీసుకోలేకపోతోందన్నారు.

వాక్ స్వాతంత్ర్యం వంటి ప్రాథమిక హక్కులు కూడా పలుదేశాల్లో ప్రజలకు ఉండటం లేదని, ఇలాంటి హక్కులపైనా ఐరాస ప్రశ్నించలేకపోతోందని పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ నూతన ఆలోచనలతో ప్రపంచ శాంతి, ప్రపంచ న్యాయం కోసం అందరూ కృషి చేయాలన్నారు. మలేసియా పీపుల్స్ జస్టిస్ పార్టీ ఉపాధ్యక్షురాలు నూరుల్ ఐజా హుస్సేన్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ప్రభావం ప్రపంచం మొత్తంపై పడుతోందని, దీన్ని ఒక అవకాశంగా తీసుకుని అన్నిదేశాలు స్వతంత్రంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. మెక్సికో ప్రతినిధి ఎఫ్రైన్ గౌదరమా మాట్లాడుతూ లాటిన్ అమెరికా ప్రాంతంలోని 33 దేశాలు ప్రాంతీయ సహకారంతో ముందుకు సాగాలన్నారు. ప్రపంచశాంతిని నెలకొల్పడంలో అన్ని దేశాలు రాజకీయాలకు అతీతంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఎంపీ బలరాంనాయక్, సలిల్ శెట్టి, విదేశీ ప్రతినిధి పావెల్ వర్గాన్ పాల్గొన్నారు.

# రాజకీయాల్లోకి కొత్త జనరేషన్ రావాలి

(మొదటి పేజీ తరువాయి)





విపక్షాలు చెప్పేది వినకుండా వాటిని అణచివేసే ధోరణి పెరిగిందని, ఈ కారణంగానే తాను 4 వేల కి.మీ. మేర పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను తిరిగి పొందడంతోపాటు వాటి సంరక్షణ వంటి ప్రాథమ్యాలను కొత్త రాజకీయ దృక్కోణం ద్వారా పునర్నిర్మించడం ఇప్పుడు అందరి ముందున్న నిజమైన సవాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో శనివారం 'భారత్ సమ్మిట్' ముగింపు సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు. "దేశంలో కొన్నేళ్ల క్రితం ప్రతిపక్షాలకు దారులు క్రమంగా మూసుకుపోయిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీపరంగా చిక్కులు ఎదుర్కొన్నాం. మా పార్టీ కోరుకున్న విధంగా నడుచుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దాదాపుగా ఒంటరి అయిన పరిస్థితులు నెలకొన్నాయి. దాన్ని అధిగమించడానికి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాం. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దాదాపు 4 వేల కిలోమీటర్ల మేర నేను స్వయంగా పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నా. ఒకసారి దాన్ని ప్రారంభించిన తర్వాత వెనక్కి తిరిగి చూడలేదు.

**మనసుతో ఎలా వినాలో నేర్చుకున్నా..**

భారత్ జోడో యాత్రలో నేను లోతైన పాఠాలు నేర్చుకున్నాను. యాత్రలో వేల మంది మాతో చేరారు. నడవడం, వినడంపైనే పాదయాత్రలో దృష్టి సారించా. రోజులు గడిచేకొద్దీ మాట్లాడటం, ఆలోచించడం ఎలాగో నాకు తెలిసినప్పటికీ.. నేను ఇంతకు ముందెప్పుడూ పూర్తిగా లీనమై వినలేదని గ్రహించగలిగాను. పాదయాత్ర సాగుతున్నా కొద్దీ నేను మాట్లాడటం తగ్గిపోయింది. ప్రజలు చెప్పేది క్షుణ్ణంగా వినడం అలవాటైంది అనిపించేది. పాదయాత్రలో నన్ను కలిసిన ప్రజలతో ప్రేమగా మెలగడం అలవాటు చేసుకున్నా. అలా చేయడం ప్రారంభించిన తర్వాత అసాధారణ మార్పు గమనించా. ప్రజలు నాతో ఎక్కువగా మమేకం అవుతున్నారని అర్థమైంది. అప్పుడు ప్రజలతో కలవడం సులభమైపోయింది. ప్రస్తుతం సమావేశాల్లోనే కాకుండా బహిరంగ సభల్లోనూ ప్రజలు నా దగ్గరికి వచ్చి ఆప్యాయంగా పలకరిస్తున్నారు. భారత్ జోడో యాత్ర క్రమంలో నేను 'నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ కా దుకాణ్ (విద్వేషపు విపణిలో ప్రేమ దుకాణం)' తెరిచా. ఎవరెంత ద్వేషం వ్యాపింపజేసినా ప్రేమ, ఆప్యాయతలు అంతకన్నా శక్తిమంతమైనవి. ప్రజలు చెప్పేది వినడం, ప్రేమించడంతో పాటు వారితో నిజమైన అనుబంధాన్ని కలిగిఉండాలి" అని రాహుల్ గాంధీ అన్నారు. అంతకుముందు భారత్ సమ్మిట్‌లో పాల్గొనడానికి హైదరాబాద్‌కు చేరుకున్న రాహుల్ గాంధీకి శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి వేశంలో ఆయన మాట్లాడారు. "రాష్ట్ర ప్రభుత్వం పక్షాన సదస్సుకు దాదాపు వందకు పైగా దేశాల ప్రతినిధులను ఆహ్వానించడం గొప్ప విషయం. భారీ గ్లోబల్ సమ్మిట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాం. తెలంగాణలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి రోజు నుంచే ప్రజలు కేంద్రంగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. వారే కేంద్రంగా ప్రజా పరిపాలన సాగిస్తున్నాం. అణగారిన, పేదవర్గాల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం. అహింస, స్వాతంత్ర్యం, శాంతి, సమానత్వం, ప్రగతిశీల భావజాలంతో పాటు మా అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి విజన్ వంటి అంశాలను గ్రహించాం. ఇప్పటికే వీటిని కొనసాగిస్తున్నాం. భవిష్యత్తులో మా విధానాలు, పథకాలు, ఆలోచనల్లో వీటిని మరింత సమర్థంగా కొనసాగిస్తాం" అని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. అంతకుముందు ఆయన చరఖా స్టాల్‌ను సందర్శించి.. నూలు వడికారు.

# ఐదు రోజులుగా కూంబింగ్

(మొదటి పేజీ తరువాయి)



మరోవైపు.. కూంబింగ్‌లో నిమగ్నమైన జవాన్లు ఎండల బారినపడుతున్నారు. నాలుగు రోజులుగా అడవుల్లోనే మకాం వేయడంతో ఇప్పటికే 15 మంది అస్వస్థతకు గురికాగా, శుక్రవారం మరో ఐదుగురిని హెలికాప్టర్‌లో వెంకటాపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ముగ్గురిని మెరుగైన చికిత్సకు భద్రాచలం తరలించారు. ఆపరేషన్ కర్రెగుట్టల గాలింపుతో అభయారణ్యం పరిసర గ్రామాల్లో జవాన్లు ఆంక్షలను విధించడం చర్చనీయాంశంగా మారింది. సమీప వ్యవసాయ క్షేత్రాలు, నీటి నిల్వ ప్రాంతాలకు వెళ్లినా హెచ్చరిస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు.

ఇక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కొనసాగుతున్న కర్రెగుట్ట ఆపరేషన్ ను వెంటనే ఆపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మావోయిస్టులు లేఖ రాశారు. తక్షణమే ఆ ఆపరేషన్ ఆపి శాంతి చర్చలకు ముందుకు రావాలని మావోయిస్టులు విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు బస్తర్ ఇంచార్జి రూపేష్ పేరిట ఒక ప్రెస్ నోట్ విడుదల చేశారు. తెలంగాణ సరిహద్దుల్లో కొనసాగుతున్న సైనిక ఆపరేషన్ ను వెంటనే ఆపాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. గత కొంతకాలం నుంచి మావోయిస్టుల, కేంద్ర ప్రభుత్వం మధ్య శాంతి చర్చలు జరగాలనే డిమాండ్ వినిపిస్తోంది. దీనికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి మావోయిస్టులో శాంతి చర్చలు జరపాలని ఏఐటీయూసీ కోరుతోంది. దీనిలో భాగంగా ఈనెల రెండో వారంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, మావోయిస్టులు శాంతి చర్చలు జరుపుకోవాలని భేషరతుగా ఎదురు కాల్పులు విరమించుకోవాలని సూచించారు. అయితే తాజాగా మావోయిస్టులు.. ఈ మేరకు లేఖ రాశారు. తమతో శాంతి చర్చలు జరపడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు.

## మహిళా సంఘాలకు ప్రోత్సాహకాలు

(మొదటి పేజీ తరువాయి)



ఆమెలో తనను చూసుకుంటున్నానని, తాను కూడా పదో తరగతితో చదువు ఆపేశానని, అజ్ఞాతం వీడి జనజీవనంలోకి వచ్చిన తర్వాత తిరిగి చదువు కొనసాగించినట్లు చెప్పారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ చేశానని తెలిపారు. రాష్ట్రంలోని మహిళా సంఘాల సక్సెస్ స్టోరీలను విదేశీయులు ఇక్కడికి వచ్చి వింటున్నారని, రాష్ట్రానికి ఎవరు వచ్చినా మిమ్మల్ని కలవకుండా వెళ్లే పరిస్థితి లేదన్నారు.

## లీవ్ ఇండియా పేరుతో నోటీసులు: తెలంగాణ డీజీపీ

(మొదటి పేజీ తరువాయి)




మిగిలిన వారు రేపు తిరిగి వెళ్ళిపోవాలి. ఈ నెల 30 వరకు అటల్ బోర్డర్ నుండి వెళ్ళిపోవచ్చు.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. షార్ట్ టర్మ్ వీసాలు ఉండి తిరిగి వెళ్ళిపోని పాకిస్తానీయులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

ఇమ్మిగ్రేషన్ అధికారులతో కలిసి కో ఆర్డినేషన్‌లో జాయింట్ ఆపరేషన్ చేస్తాము. కర్రెగుట్టలో తెలంగాణా పోలీస్ శాఖ నుండి ఎలాంటి ఆపరేషన్ లేదు. మా బలగాలు తెలంగాణ ప్రాంతంలో ఉన్న కర్రెగుట్టల వద్ద ఎలాంటి బలగాలు మోహరించలేదు. ములుగులో కూంబింగ్ కి తెలంగాణ పోలీసులకు సంబంధం లేదు' అని డీజీపీ జితేందర్ తెలిపారు.

# గులాబీ రజతోత్సవ సంబురం

(మొదటి పేజీ తరువాయి)



గులాబీ దళం ఈ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయవంతం చేసే దిశగా పనిచేస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా రెండు దఫాలు విజయాలతో అధికారం చేపట్టి..

మూడోసారి ఓటమి చెందిన భారాస.. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ప్రతిపక్ష పాత్రలో భాగంగా.. ముఖ్యనాయకులు ప్రభుత్వంపై పోరాటంలో చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు దగ్గరయ్యేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. రజతోత్సవ బహిరంగసభ భారాస మళ్లీ తన వైభవాన్ని పొందడానికి ఓ మైలురాయి కాగలదని పార్టీ నేతలు ఆశిస్తున్నారు.

**ఆది నుంచీ వ్యూహాత్మకంగానే..**

తెరాస రాజకీయ ప్రస్థానంలో కేసీఆర్ ప్రతి అడుగూ వ్యూహాత్మకంగానే సాగింది. 2001లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి.. తిరిగి సిద్దిపేట నుంచి గెలుపొంది తెలంగాణ భావ వ్యాప్తికి బీజం వేశారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వంటి మేధావుల సహకారంతో.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఉద్యమ పార్టీగా తెరాస గుర్తింపు పొందింది. 2014లో రాష్ట్రాన్ని సాధించేదాకా అనేక రాజకీయ ఎత్తుగడలతో ఉద్యమాన్ని నడిపించింది. 2004లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని పోటీ చేయడమే కాకుండా ప్రభుత్వంలోనూ చేరింది. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ఆందోళనల ద్వారా ఒత్తిడి పెంచింది. 2009 ఎన్నికల్లో తెలుగుదేశంతో పొత్తు పెట్టుకొని పోటీ చేసింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, తెలంగాణ కోసం రాజకీయ జేఏసీ ఏర్పాటు, కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఇస్తున్నట్లు ప్రకటించడం, 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ పార్లమెంటు చట్టం చేయడంతో ఉద్యమ దశ ముగిసింది.

**పునరుత్తేజం కల్పించే దిశగా..**

తెరాసతో పాటు కాంగ్రెస్, భాజపా, సీపీఐ ఇలా అన్ని ప్రధాన పార్టీలు తెలంగాణ రాష్ట్రం కోసం ఆయా పార్టీల నేతలపై ఒత్తిడి పెంచాయి. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమ పార్టీగా తెరాసకే రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారు. రెండోసారి 2018 ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన తెరాస.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక స్థానాలను కోల్పోయింది. ఈ ఎన్నికలకు ముందే మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో విస్తరించడానికి ప్రత్యేక కమిటీలు నియమించడం, సభలు ఏర్పాటు చేయడం ద్వారా జాతీయ పార్టీగా రూపాంతరం చెందేందుకు తెరాస.. భారాసగా మారింది. తర్వాత జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓడిపోవడం పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేసింది. అయితే కొద్ది రోజులకే పార్టీ నాయకత్వం ప్రత్యేకించి.. కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు ప్రభుత్వ విధానాలపై పోరాటంలో నిమగ్నమయ్యారు. అంశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించడం, ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం ద్వారా తమ పార్టీ యంత్రాంగాన్ని చురుగ్గా ఉంచే ప్రయత్నం చేశారు. రజతోత్సవ సభకు సన్నాహకంగా ఇప్పటికే కేసీఆర్ అన్ని జిల్లాల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. కేటీఆర్, హరీశ్‌రావులు పలు నియోజకవర్గాల్లో పర్యటించి శ్రేణులను సన్నద్ధం చేశారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు కూడా పలు నియోజకవర్గాల్లో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం-27-ఏప్రిల్ 2025





## ఎన్సిసి ఫైరింగ్ చాంపియన్షిప్‌లో మొదటి దశలో సెలెక్ట్ అయిన దరిపల్లి విద్యార్థి

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

ఇటీవల ఖమ్మం రఘునాథపాలెం మండలం జింకల తండ లో ఎన్సిసి 11(టి) బెటాలియన్ ఖమ్మం సీ.వో: కల్నల్ సంజయ్ కుమార్ భద్ర సార్, ఏ.వో: కల్నల్ నవీన్ యాదవ్ సార్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఐ.డి.ఎస్.ఎస్.సి ఇంటర్ డి.టి.ఈ సర్వీస్ షూటింగ్ చాంపియన్షిప్ మొదటి దశ రెండు రోజుల ఫైరింగ్ ట్రైనింగ్ కార్యక్రమంలో ఫైరింగ్ రేంజ్ లో దరిపల్లి విద్యాసంస్థల విద్యార్థి పి మణిదీప్ మంచి ప్రతిభను చాటారు. ఈ ఫైరింగ్ లో వివిధ కళాశాల నుంచి ఎన్సిసి విద్యార్థిని విద్యార్థులు హాజరై తమ ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ ట్రైనింగ్ ఐ.డి.ఎస్.ఎస్.సి ఇంటర్ డి.టి.ఈ సర్వీస్ షూటింగ్ చాంపియన్షిప్ నందు సీ.వో: కల్నల్ సంజయ్ కుమార్ భద్ర సార్, ఏ.వో: కల్నల్ నవీన్ యాదవ్ సార్ అన్ని విధాలుగా ఉత్తమ శిక్షణను ఎన్సీసీ విద్యార్థిని విద్యార్థులకు నేర్పించారు

ఈ సందర్భంగా దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ ఫైరింగ్ లో మొదటి దశలో సెలెక్ట్ అయిన దరిపల్లి ఎన్సిసి విద్యార్థి పి మణిదీప్ ను అభినందించారు. ఎన్సిసి విభాగాన్ని డేర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయటం శుభపరిణామమని ఎన్సిసిలో మంచిగా తర్ఫీదు పొంది డేర్ కళాశాల విద్యార్థి టీ మణిదీప్ మంచి సత్తా చాటి కళాశాలకు మంచి పేరు తీసుకొని వచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థి టీ మణిదీప్ ను అభినందించడమే కాకుండా కళాశాల రోల్ ఆఫ్ హానర్ నందు మణిదీప్ పేరు శాశ్వతంగా లిఖించబడుతదని తెలిపారు. ఢిల్లీ ట్రైనింగ్ క్యాంప్ కోసము కష్టపడుతున్నానని ఈ సందర్భంగా మణిదీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి 11(టి) బెటాలియన్ ఖమ్మం సీ.వో: కల్నల్ సంజయ్ కుమార్ భద్ర సార్, ఏ.వో: కల్నల్ నవీన్ యాదవ్ సార్, దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్,ఎన్సిసి కోఆర్డినేటర్ శిరీష, అకడమిక్ ఇంచార్జ్ శిరీష, నవీన్, కళాశాల టెక్నికల్ స్టాఫ్ విద్యాసాగర్, బాబూలాల్ మరియు తదితరులు పాల్గొన్నారు.




## ఉగ్రదాడిలో మరణించిన యాత్రికులకు అశ్రునివాళి అర్పించిన మద్దిగట్ల గ్రామస్తులు

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

జమ్మూకాశ్మీర్ లోని పహల్గామా పర్యటకులపై జరిగిన ఉగ్రదాడిలో మరణించినటువంటి యాత్రికులకు శనివారం రాత్రి మద్దిగట్ల గ్రామంలో కొవ్వొత్తులతో మౌనాన్ని పాటిస్తూ.. శాంతియుత ర్యాలీ ప్రదర్శనతో వారి కుటుంబాలకు ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది. భారతదేశంలో ఉన్నటువంటి భారతీయులకే రక్షణ లేకుండా పోయింది. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారినీ కఠినంగా శిక్షించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జై జవాన్, జై కిసాన్, వందే మాతరం అంటూ నినాదాలు చేస్తూ గ్రామ ప్రజలు, యువత హోరేతిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రామచంద్ర గౌడ్, కిషోర్, వడ్ల నరసింహ చారి, జనార్ధన్,బ్రదర్ శ్రీను, పాలెం వెంకటయ్య, ఎస్. రవి,ఈశ్వర్, ఎస్.సురేష్, ఎం. మన్నెం కొండ పాల్గొన్నారు.



## వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం పెద్దమందడి మండలంలోని అల్వాల్, జగత్ పల్లి, చిన్న మందడి, పెద్దమందడి, మణిగిల్ల గ్రామాల వరి కొనుగోలు కేంద్రాలను అదరపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులు సేద తీరేందుకు కొనుగోలు కేంద్రాల్లో టెంట్, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని లేకుంటే సెంటరును మూసివేస్తామని హెచ్చరించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల పై ఉందని సూచించారు. అదేవిధంగా తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేసి ధాన్యాన్ని గోదాములకు తరలించాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. లారీలు పెట్టడంలో ఆలస్యం చేయవద్దని, అలా చేస్తే బరువు తగ్గి రైతులు నష్టపోతారని సూచించారు అనంతరం వెల్టూరు, మదనపూర్ గోదాములు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

# తన దేశ పౌరులపై యుద్ధం చేయడం ప్రపంచంలో ఎక్కడా లేదు

దండకారణ్యంలో ఆదివాసులపై సైనికులు యుద్ధం చేయడం అప్రజాస్వామికం

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన ర్యాలీ

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:




తన దేశ పౌరులపైన యుద్ధం చేయడం ప్రపంచంలో ఎక్కడా లేదని, దండకారణ్యంలో ఆదివాసులపై సైనికులు యుద్ధం చేయడం అప్రజాస్వామికమని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం శాంతి ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ... మధ్య భారతదేశంలోని దండకారణ్యంలో 'ఆపరేషన్ కగార్' ను వెంటనే ఆపివేయాలని, ఆదివాసులపై జరుగుతున్న మారణ హోమాన్ని, దాడిని నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. గత నాలుగు రోజులుగా కర్రిగుట్టలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారా మిలిటరీ బలగాలు వివిధ రాష్ట్రాల బలగాల ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న ఆపరేషన్ను వెంటనే వెనక్కి పంపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం మన్నారు. తన దేశ పౌరులపైన యుద్ధం చేయడం ప్రపంచంలో ఎక్కడా లేదని దేశ సరిహద్దుల్లో ఉండాల్సినటువంటి సైనికులు దండకారణ్యంలో ఆదివాసులపై యుద్ధం చేయడం అప్రజాస్వామీకం అన్నారు. మరొక ప్రక్క ప్రభుత్వంతో శాంతి చర్చలు జరపడానికి మేము సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించారు కానీ ప్రభుత్వ వైపు నుంచి సానుకూలమైన స్పందన రాకపోవడం వెనుక కార్పొరేట్ శక్తులు, బహుళ జాతి కంపెనీలు ఉన్నాయన్నారు. ఈ దేశ సంపదను కాపాడుకోవడం కోసం ఆదివాసులకు మద్దతుగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను పాటించి శాంతి చర్చలు జరపాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త రవి మారుత్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి విక్రమ్, ఎర్ర శ్రీనివాస్, సిపిఐ జిల్లా నాయకులు సింగు నరసింహారావు, పోటు కళావతి, శివరామకృష్ణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, సర్దార్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కార్యదర్శి స్వర్ణ సుబ్బారావు, బీఎస్పీ జిల్లా కార్యదర్శి నాగరాజు, తెలంగాణ పీపుల్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి చిర్ర రవి, జిల్లా నాయకులు కె.వెంకటేశ్వర్లు, టిపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర నాయకులు బాబురావు, తాళ్లూరు వేణు, రాష్ట్ర నాయకులు విజయ్, సామాజిక ఉద్యమకారులు అరవపల్లి విద్యాసాగర్, గుంతేటి వీరభద్రం, పేల్లూరి విజయ్ కుమార్, బీసీ సంఘం నాయకులు పెరుగు వెంకటరమణ, విద్యావంతుల వేదిక జిల్లా నాయకులు అజిత్ పాషా, నరేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్, దాసరి శ్రీను, దశరథ చావ రమేష్, రవి, సుభాను, కళ్యాణం వెంకటేశ్వరరావు, పరకాల లక్ష్మి, గాంధీ, మోహన్ రావు, ముస్లిం జేఏసీ నాయకులు అబ్దుల్ రెహమాన్,పాషా పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:




జై బాపు ,జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం పెద్దమందడి మండలం మద్దిగట్ల, మోజర్ల గ్రామాలలో పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ , పెద్దమందడి మండల్ ఇంచార్జ్ కొంకి వెంకటేష్ హాజరైనారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ..గత 11 సంవత్సరాలుగా బిజెపి పాలనలో దేశం 50 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలు దేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని కాంగ్రెస్ పార్టీ సాధించిన అభివృద్ధిని బిజెపి పార్టీకి కొనసాగించడం చేతకాక దేశంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టి అశాంతిని పెంచి ఓట్లు దండుకుంటూ రాజకీయ పబ్బం గడుపుకుంటుందని అన్నారు. గాంధీ కుటుంబానికి ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చిన మేధావులను ప్రధాన మంత్రులను చేసిన ఘనత గాంధీ కుటుంబానికి దక్కుతుందని అన్నారు.బిజెపి నాయకులు ఎన్ని కుట్రలు చేసినా ప్రపంచంలోనే ఎంతో గొప్పదైన అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం స్ఫూర్తితో మహాత్ముడు బోధించిన సత్యం, అహింస మార్గంలో నడిచి తిరిగి అధికారంలోకి వచ్చి భారతదేశంలో మళ్లీ సంక్షేమ పాలన అందిస్తామని సమ సమాజాన్ని నిర్మిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి గట్టు మన్యం, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్ ,పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గట్టు దయాకర్, పెద్దమందడి మండల్ మాజీ జెడ్పిటిసి కొమ్ము వెంకటస్వామి, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు మద్దిగట్ల మాజీ సర్పంచ్ చెన్నకేశవులు మాజీ ఉపసర్పంచ్ శివరాజ్ మద్దిగట్ల మాజీ ఎంపీటీసీ రామ చంద్రయ్య గౌడ్ మోజర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు రఘు మా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనార్ధన్ , కృష్ణ, బుచ్చిలింగం, నాగన్న, లక్ష్మీ కాంత్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ మన్యం, గట్టు రమేష్, గట్టు ధనంజయ్ ,జనం పల్లె మన్యం, కానాపల్లెశేఖర్, గట్టు కొండన్న, నరసింహ,రాములు యాదవ్, దాసరి రమేష్, వెంకటన్న,గట్టు విజయ భాస్కర్, గట్టు కిరణ్, అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి ఆయా కుటుంబానికి ఆర్థిక సహాయం

వనపర్తి సిడిపిఓ హాజీరా బేగం

వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:

పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన అంగన్వాడీ 3 వ కేంద్రానికి చెందిన ఆయా నాసాని మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. మల్లమ్మ కుటుంబానికి సిడిపిఓ హజీరా బేగం ఆధ్వర్యంలో 10000/రూ ఆర్థిక సహాయాన్ని అందించి, వారి కుటుంబానికి అండగా నిలిచారు. మల్లమ్మకు శాఖ నుండి వచ్చే బెనిఫిట్స్ అందేలా త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత శాఖ అధికారులు ఆర్థిక సహాయం అందించడం పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ హాజీర బేగం, సూపర్వైజర్ సుధా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పాకిస్తాన్ ముష్కరుల దాడిని ఒక సామాజిక వర్గానికి, మతానికి ఆపాదించడం సరైనది కాదు

సమ్మాన్ ఎన్జీవో వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్వకేట్ సాదిక్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో పాకిస్తాన్ ముష్కరుల దాడిని ఒక సామాజిక వర్గానికి, మతానికి ఆపాదించి అమాయక ముస్లిం మైనారిటీలను టార్గెట్ చేయడం దాడులకు పాల్పడటం, హింసించడం తగదని సొసైటీ ఫర్ ఆల్ ముస్లిం మైనారిటీస్ అభివృద్ధి మరియు న్యాయ్(సమ్మాన్ ఎన్జీవో) వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్వకేట్ సాదిక్ షేక్ కోరారు. పహల్గాం లో ముష్కరుల దాడిని కుల మతాలకు రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ ఖండిస్తున్నా, కొందరు ఇస్లాంను, ముస్లింలను టార్గెట్ చేయడం దారుణం, ఇలాంటి వైఖరి తీవ్రవాద, ఉగ్రవాద మతోన్మాద లక్షణాల తో సమానం. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో కొన్ని బీజేపీ పాలిత ప్రాంతాల్లో పేర్లు మతం అడిగి ముస్లిం మైనార్టీలు ఐతే హింసించడం, ఊరు ఖాళీ చేసి వెళ్ళిపోమనడం చాలా ఘోరం అని వారి పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గారు, దేశ ప్రధాన మంత్రి మోడీ గారు పరిస్థితులు చేయి దాటక ముందే కఠిన చర్యలు తీసుకోవాలని, సబ్ కా సాత్ సబ్ కా వికాస్ మరియు విశ్వాస్ అనే నినాదాన్ని చేతల్లో అమలు చేసి చూపాలని అడ్వకేట్ సాదిక్ షేక్ కోరారు. జైపూర్ నుండి ముంబై వెళుతున్న ట్రైన్ లో జూలై 31 2023 ఉదయం తెల్లవారుఝామున 5 గంటలకు ఆర్ పి ఎఫ్ కానిస్టేబుల్ చేతన్ సింగ్ చౌదరీ మతం అడుగుతూ, ముస్లిం లు అని గడ్డం టోపీ ఉన్న ముగ్గురు అమాయకులను ASI తుకారాం మీనా నీ నిర్లక్ష్యం గా తుపాకీ తో కాల్చి చంపిన ఘటన ను గుర్తు చేశారు.bజమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లా పహల్గాం లోని బైసరన్ వ్యాలీ లో ఏప్రిల్ 22 న తీవ్రవాదుల కాల్పుల్లో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది, 20 మంది తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం మనందరికీ తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రా , తెలంగాణ లోనే కాక యావత్ భారతదేశం లో శాంతియుత నిరసనలు తెలపడం, టెర్రరిజం ముర్దాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్, హిందూస్తాన్ జిందాబాద్ అనే నినాదాలు ఇవ్వటం జరిగింది. దోషులను కఠినంగా శిక్షించాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందిస్తూ బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని ప్రతి ఒక్కరు కుల మత రాజకీయాలకు అతీతంగా డిమాండ్ చేస్తూ నిరసనలు చేయడం జరిగింది అని సాదిక్ షేక్ పేర్కొన్నారు. పహల్గాం లో టూరిస్ట్ గైడ్ లు , గుర్రాలు నడిపించే వారు లోకల్ కాశ్మీరీ ముస్లిం లు ముష్కరులు చేస్తున్న దాడి నుండి ఎందరో పర్యాటకులను కాపాడి సహకరించిన విషయం మరిచిపోవద్దని వారు కూడా ముస్లిం లేనని గుర్తు చేశారు. ఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్న దాడి లో పాల్గొన్న ఉగ్రవాదులను పట్టుకోవడం లో కానీ తీవ్రవాద సంస్థను నేటి వరకు కేంద్ర హోం శాఖ గుర్తించకపోవడం బాధాకరం అన్నారు .పహల్గాం ఘటన నేపథ్యం లో పాకిస్తాన్ తో ఎటువంటి సంబంధాలు కొనసాగించరాదని భారత విదేశాంగ శాఖ తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తూ ఇవి కేవలం రాజకీయ, మీడియా వ్యాఖ్యలుగా కాకుండా పూర్తి స్థాయి లో తీవ్రవాదం ను, తీవ్రవాదులను భారతదేశం వైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సాదిక్ షేక్ డిమాండ్ చేశారు.



## గృహ ప్రవేశ వేడుకకు హాజరైన మాజీ డిప్యూటీ సిఎం రాజయ్య

**చిల్పూర్,తెలంగాణ ముచ్చట్లు:**చిల్పుర్ మండలం పల్లగుట్ట గ్రామంలో సీనియర్ నాయకుడు గుర్రపు రమేష్ నూతన గృహ ప్రవేశోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరై, గుర్రపు రమేష్ కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గృహ ప్రవేశం సందర్భంగా డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి తన స్వంత గృహం ఒక గొప్ప గౌరవ సూచకమని, అలాంటి ఆనంద సందర్భంలో భాగమవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. నాయకుడిగా రమేష్ గ్రామానికి సేవలను అందించే విధంగా ఎదగాలని ప్రశంసిస్తూ, రాబోయే రోజుల్లమరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రమేష్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాలోత్ రమేష్‌నాయక్,రంగు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



## బిజెపి పిలుపు మేరకు
# సత్తుపల్లిలో బంద్ విజయవంతం

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:**

శనివారం సత్తుపల్లి పట్టణంలో జమ్మూ కాశ్మీర్ లో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బంద్ కి పిలుపునిచ్చింది. సత్తుపల్లి వర్తక సంఘాలు కూడా బంద్ కు మద్దతు తెలుపుతూ స్వచ్ఛందంగా షాపులు మూసివేశారు. ఈ సందర్భంగా నంబూరి మాట్లాడుతూ.. బంద్ కి సహకరించిన సత్తుపల్లి పట్టణం లోని దుకాణదారులకు, ఉద్యోగస్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. కాశ్మీర్ లో జరిగిన దాడిని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం వదిలిపెట్టదని ఉగ్రవాదం పై ఉక్కుపాదం మోపుతామని ఉగ్రవాదులకు సహకరించే పార్టీలను, వ్యక్తులను దేశం వదిలి పారిపోయేలా చేస్తామని ఆయన అన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ రమేష్, పుల్లారావు యాదవ్ మాట్లాడుతూ ఈ దేశంలోని ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్, వక్ఫ్ బోర్డు నియంత్రణ చట్టం వంటివి తెచ్చి ముస్లిం వర్గానికి మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయడమే లక్ష్యంగా జరిగిన ఈ ఉగ్రదాడిని ఖండిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఇస్లామిక్ ఉగ్రవాదం పై ఉక్కుపాదం మోపుతామని వారికి సహకరించే గుంట నక్కలను కూడా వదలమని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ వి రమేష్, పుల్లారావు యాదవ్ అన్నారు. కార్యక్రమంలో వేంసూర్ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు పర్శ రాంబాబు, కృష్ణయ్య, సత్తుపల్లి బిజెపి మండల కార్యదర్శి శాలి శివకృష్ణ, సి హెచ్ వసంతరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్, మంద శివకృష్ణ యాదవ్, తెనాలి అశోక్ కుమార్, మెరుగు శేషగిరిరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగస్వామి, సుబ్రమణ్యం, కార్తీక్ యాదవ్, రాము రేచర్ల చందు, బంద్ కి సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# ఉన్మాదం దేశానికి ప్రమాదకరం

- ప్రజలను విస్మరిస్తే పతనం తప్పదు
- పేదల ఆయువు ఎర్ర జెండానే
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- వరద నర్సింహారావు సహా సిపిఐలో వందలాది మంది చేరిక
- ఖమ్మంలో భారీ ప్రదర్శన



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఉన్మాదం దేశానికి ప్రమాదకరమని దేశ భవిష్యత్తుకు అది గొడ్డలి పెట్టుగా మారనుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉన్మాదానికి, టెర్రరిజానికి మతం ప్రాధాన్యత కాదని అలజడి సృష్టించడం ప్రజలను హింసించడమే దాని లక్ష్యమని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీలో ఖమ్మం నగరానికి చెందిన వరద నర్సింహారావు సహా వందలాది మంది సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా ఖమ్మం ముస్తఫానగర్ సెంటర్ నుంచి అల్లిపురం రోడ్డులోని బహిరంగ సభా స్థలి వరకు డప్పు, కోలాట దళాలు వందలాది మంది కార్యకర్తలతో ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్కే జానిమియా అధ్యక్షతన జరిగిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ ఉన్మాదులకు మతం లేదని గతంలో అనేక మంది ప్రముఖులను హతమార్చిన విషయంలోనూ ఇది రుజువైందన్నారు. టెర్రరిజం విషయంలో ఒక మతాన్ని బూసిగా చూపడం సరి కాదన్నారు. టెర్రరిస్టు దాడిని అంచన వేయడంలోనూ, అడ్డుకోవడంలోనూ వైఫల్యం చెందిన తర్వాత దేశ ప్రజల ఆలోచనలను మళ్లించే రీతిలో మోడీ, అమిత్ లాంటి నేతలు ప్రకటనలు చేస్తున్నారని ఇది సరి కాదని ఆయన స్పష్టం చేశారు. విభిన్న మతాల, కులాల, భాషల సమ్మిళితమైన భారతదేశంలో ఏకపక్ష విధానాలు దేశ విచ్ఛిన్నానికి దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. ఉన్మాద మూర్ఖుల చేష్టలను ఒక మతానికి, ప్రాంతానికి ముడి పెట్టడం సరికాదన్నారు. పెహల్గాం ఘటనలో ముస్లిం టెర్రరిస్టులు కాల్చి చంపితే అదే ఘటనలో గాయపడిన వారికి అనేక మందికి ముస్లింలు సేవలు అందించి ప్రాణాలు కాపాడరన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. ప్రజలను విస్మరించి పాలన చేస్తున్న మోడీ తన అనుకూలురైన సంస్థల అధిపతులకు మేలు చేస్తున్నారన్నారు. కమ్యూనిస్టుల అవసరం ఈ దేశంలో పెరుగుతుందన్నారు. లౌకిక, ప్రజాస్వామిక వాదులు కమ్యూనిస్టుల అవసరాలను గుర్తిస్తున్నారని ఈ దేశ ప్రజలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించిన నాడు ప్రజా వ్యతిరేకులకు గుణపాఠం తప్పదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని తిరిగి ప్రజల విశ్వాసం పొందాల్సిన అవసరం పాలకులకు ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పేదల పక్షాన పోరాడుతుందని ప్రజల సంక్షేమమే కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని దీనిపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలన్నారు. కమ్యూనిస్టులకు మాత్రమే దేశ ప్రజలను చైతన్యపరిచే శక్తి ఉందని ప్రజలు చైతన్యవంతులైతే టెర్రరిజం మూలాలు ఉండవని కూనంనేని తెలిపారు. నిరంతరం ప్రజల చైతన్యం కోసం, హక్కుల కోసం, సమస్యల పరిష్కారంకోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందన్నారు. రాజకీయాలు కలుషితం అవుతున్నాయని ఫిరాయింపుదారులు పెరిగి ప్రజల మనోభావాలను హేళన చేస్తున్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ద్రోహం చేసిన ఎవరిని వదిలేది లేదన్నారు. అధికారం శాశ్వతం కాదని ప్రజల పక్షాన పనిచేయడమే అతి గొప్ప అధికారమని ఆయన తెలిపారు. వరద నర్సింహారావు సహా వందలాది మందికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నగర సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, వరద నర్సింహారావు తదితరులు ప్రసంగించగా ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, మహ్మద్ సలాం, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, తాటి నిర్మల, బోడా వీరన్న, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాలరామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**భారీ ప్రదర్శన :**

సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముస్తఫానగర్ సెంటర్ నుంచి అల్లిపురం రోడ్డులోని బహిరంగ సభాస్థలి వరకు భారీ బహిరంగ సభ జరిగింది. డప్పు, కళా నృత్యాలు, కోలాటం దళాలు నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం జెండా. ఊపి ర్యాలీని ప్రారంభించారు. అగ్రభాగాన సిపిఐ జిల్లా నాయకత్వం నడవగా పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రదర్శనలో పాల్గొన్నారు.




# అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు అభివృద్ధి
- వనపర్తి సిడిపిఓ హాజీరా బేగం

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిలుకటోని పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనపర్తి సిడిపిఓ అధికారిని హాజీరా బేగం హాజరయ్యారు. ఈ మాట్లాడుతూ హాజీరా బేగం మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అంగన్వాడి కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగానే నేడు చిలుకటొని పల్లి అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్వాడి కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం పూర్తి చేసుకున్న 5 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రోగ్రేస్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సుధా, అంగన్వాడీ టీచర్ మంజుల, హెల్పర్ అంజమ్మ, ఏఎన్ఎం తారా దేవి, ఆశా వర్కర్లు వసంత, సుగుణ, మమత విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రమాదం..
# ఓ నిండు ప్రాణం బలి

### మృతుడు రామ్ సాగర్ బంధువులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన రామ్ సాగర్ అనే వ్యక్తి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగి మృతి చెందడం జరిగిందని అతని బంధువులు ఆరోపించారు. బంధువుల వివరాల ప్రకారం రామ్ సాగర్ పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏ గా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారి కార్యాలానికి ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదం జరిగి గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడం జరిగిందని బంధువులు తెలిపారు. పెద్దమందడి మండలం మోజర్ల దగ్గర రోడ్డుపై బ్రిడ్జి పనులు జరుగుతున్న క్రమంలో తాత్కాలికంగా రోడ్డుపై మట్టితో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. మట్టి తో పెద్దగా స్పీడ్ బ్రేకర్లు వేసి ఏలాంటి ప్రమాద సూచికల బోర్డులు, రేడియం స్టిక్కర్స్, లైటింగ్ లేకుండా కేవలం మట్టి తో పెద్ద పెద్దగా స్పీడ్ బ్రేకర్లు రోడ్డుపై ఏర్పాటు చేయడంతో ప్రమాదం జరిగిందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగి రామ్ సాగర్ మృతి చెందడం జరిగిందని అన్నారు. రోడ్డుపై బ్రిడ్జి పనులు జరుగుతుండగా... కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదం జరిగి ఓ నిండు ప్రాణం బలైందని బంధువులు ఆరోపిస్తున్నారు. రాంసాగర్ కు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ పోషణ కు పెద్ద దిక్కుగా ఉన్న రాంసాగర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. దాదాపు రెండు నెలలు మృత్యువుతో పోరాడి శనివారం రామ్ సాగర్ మృతి చెందడంతో వెల్టూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధ్యతారహితంగా వ్యవహరించిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. చనిపోయిన రామ్ సాగర్ కుటుంబానికి కాంట్రాక్టర్ బాధ్యత వహించాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

ఇది ఇలా ఉండగా... రామ్ సాగర్ ప్రమాదానికి గురికాకముందే పదిహేను రోజుల ముందు అదే మోజర్ల గ్రామంలో మరొక బ్రిడ్జి నిర్మాణం పనుల్లో భాగంగా అక్కడ కూడా స్పీడ్ బ్రేకర్ పెద్దగా ఏర్పాటు చేయడంతో పెద్దమందడికి చెందిన ఓ యువకుడు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు కావడం జరిగింది. ఇదే విషయాన్ని స్థానిక విలేకరులు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమాధానం దాటవేశారు. స్థానిక విలేఖరులు దృష్టికి తీసుకెళ్లిన బాధ్యతరాహితంగా వ్యవహరించి నిండు ప్రాణానికి కారణమైన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని రాంసాగర్ కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, స్థానికులు కోరుతున్నారు.

# వరంగల్ సభను విజయవంతం చేద్దాం


### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప



**మెదక్ బ్యూరో, టేక్మాల్ తెలంగాణ ముచ్చట్లు:** వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో మండల పార్టీ నాయకులు,కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేకత వరంగల్ వేదికగా ఎండగట్టాలని సూచించారు. 27న పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని టేక్మాల్ మండల వ్యాప్తంగా గులాబీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులను కోరారు. మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి
# రూ.50,000 వితరణ

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:**




సత్తుపల్లి పట్టణం లో పాత సెంటర్లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.50,000 ఖర్చుతో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రసాద్, పుష్పవతి దంపతులు మకర తోరణం ఏర్పాటు చేయించారు.దీనిని శనివారం ఆలయ కమిటీ నిర్వాహకుల ద్వారా వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేశారు. పట్టణ ప్రముఖులు ఇమ్మడి రంగారావు తరపున తన కుమారుడు డాక్టర్ ప్రసాద్ ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలు ఇమ్మడి రంగారావు, ప్రసాద్, పుష్పావతి లను ఆలయ కమిటీ నిర్వాహకులు చల్లగుళ్ళ శ్రీనివాస్, దోసపాటి ప్రసాద్ అభినందించారు.

## వరంగల్ రజతోత్సవ సభను
# విజయవంతం చేయాలి

### బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువత కార్యదర్శి నాయికోటీ భాస్కర్

**మెదక్ బ్యూరో /టేక్మాల్ తెలంగాణ ముచ్చట్లు:** టిఆర్ఎస్ ఎప్పుడు ప్రజల పక్షమే అన్నారు. వరంగల్ లో నేడు 27న నిర్వహించతలపెట్టి బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు లక్షలాదిగా తరలిరావాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా యువ కార్యదర్శి నాయికోటీ భాస్కర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం పేద బడుగు వర్గాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నేడు వరంగల్ లో జరుగునున్న బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# వివాదాస్పదమవుతున్న గవర్నర్ వ్యవస్థ




దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేతలూ వర్సెస్ రాజ్యాంగాధినేతల మధ్య ఘర్షణ వాతావరణం రోజురోజుకు చర్చనీయాంశం అవుతోంది. రాష్ట్రాల్లో గవర్నర్ వర్సెస్ గవర్నమెంట్ మధ్య దూరం మరింత పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్రాల్లో విభిన్న ప్రభుత్వాలున్నప్పుడు ఈ ఘర్షణ అనివార్యమవుతోంది. అధికారాల విషయంలో ఎప్పుడూ ఏదో ఒక అలజడి జరుగుతూనే ఉంది. తరుచూ ఏవో ఒక ప్రకంపనలు చెలరేగుతూనే ఉన్నాయి. కేరళ, తమిళనాడు ఇలా ఒక్కోరాష్ట్రంలో గవర్నర్ వ్యవస్థ వివాదం అవడంతో దేశవ్యాప్తంగా చర్చనడుస్తోంది. రాష్ట్రాలలో గవర్నర్లు, నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీతో సహా కేంద్ర భూభాగాల్లో లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా అడ్మినిస్ట్రేటర్ ఉన్నారు. గవర్నర్ నామమాత్రపు అధిపతిగా వ్యవహరిస్తారు, అయితే నిజమైన అధికారం రాష్ట్రాలలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వారి మంత్రి మండలిపై, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ లేదా అడ్మినిస్ట్రేటర్ వద్ద ఉంటుంది.ఢిల్లీ, పుదుచ్చేరి మినహా గవర్నర్ ఒక ముఖ్యమంత్రి నేతత్వంలోని మంత్రుల మండలితో అధికారాన్ని పంచుకుంటారు. ఆర్టికల్ 153 ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఓ గవర్నర్ అవసరం. గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లను ఐదేళ్ల కాలానికి భారత రాష్ట్రపతి నియమిస్తారు. ఆర్టికల్ 154 ప్రకారం రాష్ట్ర గవర్నర్‌కి కార్యనిర్వాహక అధికారం ఉంటుంది. పరోక్షంగా అధికారుల ద్వారా పరిపాలన చేయవచ్చునేది దీనర్థం. అయితే గవర్నర్ వ్యవస్థ అనేది స్వాతంత్ర్యానికి పూర్వం అంటే బ్రిటీష్ పాలన నుండే ఉన్నది. అప్పట్లో వైశ్రాయ్ కీలకమైన పదవి. గవర్నర్ కేవలం కార్యనిర్వాహక అధిపతి. బ్రిటీష్ చట్టాలకు అనుగుణంగా నాడు ఏర్పడిన ఈ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గవర్నర్ వ్యవస్థ వారధిలా ఉండాలనే ఉద్దేశంతో దీనిని కొనసాగిస్తున్నారు. కానీ ఇదే గవర్నర్ వ్యవస్థను ఆసరా చేసుకుని కేంద్ర ప్రభుత్వాలు, రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయించిన సందర్భాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఓ బిల్లును ఆమోదించినప్పుడు స్పష్టత కోరే అధికారం గవర్నర్‌కు ఉంది. అయినా ఆ బిల్లును అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే. దేశంలో గవర్నర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య వివాదాలు కొత్తేమీ కాదు. చాలా రాష్ట్రాల్లో గతంలో ఇలాంటి వివాదాలు తారాస్థాయికి వెళ్లాయి. మొన్నటిదాకా ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ వర్సెస్ అక్కడి గవర్నర్ మధ్య వివాదం గతంలో నిత్యకత్యంలా మారింది. అసలు గవర్నర్ పదవి అనేది ఫెడరల్ వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించాల్సిన బాధ్యతాయుతమైన స్థానం. అయితే ఇక్కడ బాధాకరమైన విషయమేమంటే రాష్ట్రాల్లో ప్రత్యర్థి పార్టీ ప్రభుత్వం ఉన్నపుడు, కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న గవర్నర్లు ప్రభుత్వ విధానాలను అడ్డుకోవడం వంటి ఆరోపణలు ఎదురవుతున్నాయి.

ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఒక చారిత్రాత్మకమైన నిర్ణయంగా మిగిలింది. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి వ్యవహారంపై ఇచ్చిన తీర్పులో, రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ తిరస్కరించినా, మళ్లీ అవే బిల్లులు తిరిగి రెండోసారి ఆమోదించి పంపినప్పుడు వాటిని రాష్ట్రపతికి పంపకుండా తన వద్దే ఉంచుకోవడాన్ని కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపే అంశంగా ఉందని, గవర్నర్ తన పదవి ద్వారా స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించొద్దని హెచ్చరించింది. అలాగే బిల్లులను ఆమోదించడంలో ఆలస్యం చేయకూడదని, మూడు నెలల వ్యవధిలోనే నిర్ణయం తీసుకోవాలని కోర్టు సూచించింది. అలాగే వైస్ ఛాన్సలర్లు, ఇతర విద్యా వ్యవస్థ సంబంధిత నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై జాప్యం చేయకూడదన్న సూచన కూడా ఈ తీర్పులో ఉంది.అయితే ఇది కేవలం తమిళనాడు గవర్నర్ విషయంలోనే కాకుండా, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఈ తీర్పు మార్గదర్శకంగా నిలుస్తుందనేది న్యాయనిపుణుల అభిప్రాయం. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో స్పష్టత తీసుకురావడంతో పాటు, ఫెడరల్ వ్యవస్థను మరింత బలపరిచే దిశగా ఉన్నది. కాబట్టి ఇప్పటికైనా గవర్నర్ వ్యవహారశైలి మారకపోతే, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం దిగజారే ప్రమాదం ఉంది. గవర్నర్ ఒక స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా, రాజ్యాంగ ప్రమాణాలను గౌరవించే వ్యక్తిగా ఉండాలన్నది ఈ తీర్పు ద్వారా వెల్లడైన సందేశం.

ఈ గవర్నర్ల వివాదమనేది మన తెలుగు నేలను కూడా గతంలో ఆవహించిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి ఎపి, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఇప్పటి వరకు పని చేసిన గవర్నర్లలో అత్యంత వివాదాస్పదుడు రావ్‌న్‌లాల్.1984లో ఎన్‌టి రామారావు ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసి నాదెండ్ల భాస్కరరావును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అనుమతించిన గవర్నర్‌గా ఆయన చరిత్రలో నిలిచారు. ఆనాటి కాంగ్రెస్ సారథ్యంలో ఇందిరా గాంధీ అయినా, నేడు బిజెపి సారథ్యంలో నరేంద్ర మోడీ అయినా కేంద్రంలో ప్రభుత్వం మారిన ప్రతీసారి రాష్ట్రాల్లో తమ ఇష్టానుసారంగా గవర్నర్లను మార్చే చర్యల వల్ల రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్ వ్యవస్థే ఇబ్బందికరంగా మారింది. దాని పర్యవసానంగానే నేడు గవర్నర్లు కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్లుగా వ్యవహరిస్తూ బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆయా ప్రభుత్వాల నేతత్వంలో అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను క్లియర్ చేయటం లేదు. దీనివల్ల గవర్నర్ వ్యవస్థ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగిస్తుంది. ఇది రాష్ట్రాల మధ్య విభేదాలకు దారి తీస్తుంది. మోడీ ప్రభుత్వం గవర్నర్లను అడ్డు పెట్టుకుని రాష్ట్రాల హక్కుల మీద, రాజ్యాంగంలోని ఫెడరల్ సూత్రాల మీద తీవ్రమైన దాడి చేయడం 2014 నుండి జరుగుతూనే ఉంది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, కర్నాటక, కేరళలో ఈ దాడులను చూశాం. గవర్నర్లకు రాజ్యాంగం ఇచ్చిన కొన్ని విచక్షణాధికారాలను ఉపయోగించుకుని వారు సమాంతర అధికార కేంద్రాలుగా మారడానికి ప్రయత్నిస్తున్నారు. మన రాజ్యాంగంలోని అన్ని మౌలిక అంశాల మీద అంటే లౌకికత్వం, ప్రజాసామ్యం ముఖ్యంగా పార్లమెంటరీ ప్రజాసామ్యం, ఫెడరలిజం మొదలైన రాజ్యాంగ మౌలిక అంశాలన్నింటి మీద జరుగుతున్న దాడిలో ఇదో భాగం. అందుకే ప్రజాస్వామ్యంలో ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా ఆరో వేలుగా ఉండి, అసలు ప్రజాస్వామ్యాన్నే పెను ప్రమాదంలోకి నెడుతున్న ఈ గవర్నర్ వ్యవస్థ అవసరం ఇంకా ఉన్నదా? అని ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

# ప్రసూతి చికిత్స పితామహుడు



డా. వి.ఎన్.శిరోద్కర్ ప్రపంచవ్యాప్తంగా 'శిరోద్కర్ కుట్టు' కనుగొన్న వ్యక్తిగా ఖ్యాతిగాంచారు. ఆయన మహిళల వ్యాధుల చికిత్సకు ఎంతో దోహదం చేశారు. విఠల్ నగేశ్ శిరోద్కర్ 1899లో గోవాలోని శిరోదా గ్రామంలో జన్మించారు. గ్రామం పేరు మీదనే వారికి ఆ ఇంటి పేరు సంక్రమించింది. హుబ్లీలో విద్యను అభ్యసించి ముంబయిలోని గ్రాంట్ వైద్య కళాశాలలో చేరారు. 1923లో ఎం.బి.బి.ఎస్. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. గర్భధారణ, ప్రసూతి శాస్త్రంలో స్పెషలైజేషన్‌తో ముంబయి విశ్వవిద్యాలయం నుంచి 1927లో యం.డి. పట్టా పొందారు. ఉన్నత విద్య కోసం ఇంగ్లాండు వెళ్ళారు. అక్కడ పని చెయ్యటం ఆయనకు ఎంతగానో తోడ్పడిరది. ఆధునిక శస్త్ర చికిత్స విధానాలను అక్కడ నేర్చుకున్నారు. ఎందరో ప్రముఖ వైద్యులను, శాస్త్రజ్ఞులను కలుసుకున్నారు. 1931లో ఎఫ్.ఆర్.సి.ఎస్ (ఇంగ్లాండు) పొందారు. ముంబయిలో జె.జె.ఆసుపత్రులకు గర్భధారణ, స్త్రీల వ్యాధులలో గౌరవ ఆచార్యులుగా నియుక్తులయ్యారు. జె.జె. ఆసుపత్రి చాలా విశిష్టమైనది. 4,000 పడకలతో ప్రపంచంలోని పెద్ద ఆసుపత్రులలో అది ఒకటి. 1,500 పట్టా స్థాయి, 650 పిజి స్థాయి విద్యార్థులు ఉంటారు. అది ఆసియాలో ఆధునిక విద్యకు 175 సంవత్సరాల చరిత్ర కలిగిన ఒక ప్రాచీన విద్యా సంస్థ. ఇదే సంస్థలో చారిత్రక ఖ్యాతి గాంచిన రాబర్ట్ కాచ్ పనిచేశారు. క్షయ వ్యాధి మీద చేసిన పరిశోధనలకు అతనికి నోబెల్ పురస్కారం లభించింది. మామూలు గర్భసంచిలో గర్భాశయ ముఖ కండరం మూసుకుని ఉంటుంది. బలహీన గర్భాశయంలో గర్భాశయ ముఖద్వారం తెరుచుకుని ఉంటుంది. 1955లో డాపప శిరోద్కర్ గర్భాశయ ముఖానికి శస్త్ర చికిత్స గురించి వివరించారు. కాల పరీక్షకు నిలబడి ఈనాటికీ దీనిని పాటిస్తున్నారు. గర్భాశయ లోపాలను సరిచేయడానికి ప్రత్యేకమైన పరికరాలను రూపొందించారు. దీనికి చాలా మార్పులు చేశారు కానీ అసలు శస్త్ర చికిత్స ఇప్పటికీ అద్వితీయంగా నిలిచి ఉంది.1951లో పారిస్ లోనూ, 1956లో నేపుల్స్ లోనూ జరిగిన అంతర్జాతీయ సమావేశాలలో తన శస్త్ర చికిత్స గురించి వివరించారు. ఒక హాలీవుడ్ తారకి ఈ పద్ధతితో శస్త్ర చికిత్స సఫలం కావడంతో అతడి ఇటాలియన్ బంధం మరింత బలపడిరది. అన్ని రకాల గర్భస్రావాలకు తన శస్త్ర చికిత్స పని చేయదని తెలుసుకోగల సునిశిత బుద్ధి ఆయనది. ఎటువంటి పరిస్థితుల్లో తన శస్త్ర చికిత్స ఉపయోగపడే అవకాశముందో, ఎటువంటి వాటిలో ఉపయోగపడదో స్పష్టంగా విశదీకరించారు. సామాన్యంగా అనిపించే ప్రతి దానిని ప్రశ్నించే తత్వం కలిగిన డాపప శిరోద్కర్‌కు శస్త్ర చికిత్స, దాని వెనక ఉన్న ఆలోచన తట్టి ఉండొచ్చు. ఈ శస్త్ర చికిత్సపై రాసిన పత్రానికి పీఠికలో ఇలా పేర్కొన్నారు ''పరిపూర్ణం కాని శస్త్ర చికిత్స పద్ధతుల పట్ల నేను సంతృప్తి చెందేవాడిని కాదు. ఎప్పటి నుంచో వాడుకలో ఉన్న పద్ధతులను మెరుగు పరచడానికి నాకు ఉపాయాలు తడుతూ ఉండేవి.''1951 జూన్‌లో ఫ్రెంచి గైనకాలజీ సంఘ రజతోత్సవ ఉత్సవాల్లో, గర్భాశయ ముఖం చుట్టూ మూడు వరుసల కాటన్ పెట్టడానికి శస్త్ర చికిత్స చేసే విధానాన్ని చిత్రాల ద్వారా చూపించారు. ఆ తరువాత కరిగే గుణం ఉన్న కాటన్ ఇందుకు సరైనది కాదని గమనించారు. ఈ పద్ధతిని మార్చి 46 నెలల్లో అకారణంగా జరిగే గర్భస్రావాలకు తొడ నుంచి తీసిన నారపట్టి (ఫాసియా లాటా) లినెన్లు ఉపయోగించే శస్త్ర చికిత్సను రూపొందించారు. దీనినే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ''శిరోద్కర్ శస్త్ర చికిత్స''గా పిలుస్తున్నారు. ఇందుకు రాబోయే తరాలు ఎప్పటికీ ఆయనను గుర్తుంచుకుంటాయి. 1971 మార్చి 7న ప్రొఫెసర్ శిరోద్కర్ ముంబయిలో మరణించారు. ఆయన తల్లి గర్భాశయ ముఖ క్యాన్సర్‌తో మరణించారు. డాపప శిరోద్కర్ కుమారుడు మనోహర్ శిరోద్కర్ ఈ వ్యాధికి ఉన్న వైరల్ కారణాలపై పరిశోధనలు జరిపారు. మొదట్లో ఆయన జాన్ హాప్కిన్స్ ప్రజారోగ్య కళాశాలలో పని చేశారు. క్యాన్సర్ కారకమైన 'రౌస్ సర్కోమా' వైరస్ (మొట్టమొదటగా కనుగొన్న క్యాన్సర్ వైరస్) గురించి పరీక్షలు జరిపారు. తరవాత ఆయన పూనాలోని రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ వైరస్ పరిశోధనా కేంద్రంలో పని చేశారు. యువకునిగా ఉన్నప్పుడు మనోహర్ శిరోద్కర్, ప్రఖ్యాతిగాంచిన తన తండ్రి పట్ల ఆరాధన ఉన్నప్పటికీ, వైద్య విద్య పట్ల ఆసక్తి చూపలేదు. 1976లో, మనోహర్, ఆయన భార్య సుధ డాపపవి.ఎన్.శిరోద్కర్ జ్ఞాపక పరిశోధన ఫౌండేషన్ ని స్థాపించారు. ఈ సంస్థ మనోహర్ శిరోద్కర్, ఆయన తండ్రి కన్న కలలకు రూపాన్ని ఇచ్చింది. ఈ సంస్థ అట్టడుగు వర్గాలకు చెందిన యువతుల్లో గర్భాశయ ముఖ క్యాన్సర్ పరీక్షలు జరుపుతుంది. వైరల్ వ్యాధులను నయం చేయడానికి కొత్త జైవిక ఏజెంట్లపై పరిశోధనలు చేస్తుంది. విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉండటమే కాకుండా, ప్రొ. వి.ఎన్. శిరోద్కర్ విస్తృతంగా రాసేవారు. సాంఘిక వైద్యంలో ఆసక్తి కనపరిచేవారు. గర్భస్రావాలకు సంబంధించిన శాంతీలాల్ షా కమిటీలో ఆయన సభ్యులు. భారత దేశంలో కుటుంబ నియంత్రణ సంస్థను స్థాపించారు. 1971లో భారత ప్రభుత్వం ఆయనను పద్మ విభూషణ్ బిరుదుతో సత్కరించింది.

# కశ్మీర్‌కు వెళ్లవద్దు ..బాధితులు కావద్దు

**వాషింగ్టన్ :** జమ్మూ కశ్మీర్‌లో హింసాత్మక అశాంతి, అరాచకం నెలకొనే ముప్పు ఉందని అమెరికా హెచ్చరించింది. పహల్గామ్‌లో ఉగ్రదాడుల తరువాత అమెరికా ఇంటలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగాయి. కశ్మీర్‌లో క్షేత్రస్థాయి పరిస్థితులను ఆకళింపు చేసుకున్న తరువాత ఈ హెచ్చరికలు వెలువడ్డాయి. అమెరికన్లు ఎవరూ ఇప్పుడు జమ్మూ కశ్మీర్‌లో పర్యటించరాదు. ప్రత్యేకించి పర్యాటక, చారిత్రక ప్రదేశాలకు వెళ్లరాదని సూచనలు వెలువరించారు.భారత్ పాకిస్థాన్ సరిహద్దులకు పది కిలోమీటర్ల పరిధిలోకి వెళ్లరాదు. పౌరులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు దిగే వీలుంది. ప్రత్యేకించి సరిహద్దుల వెంబడి చొరబాట్లకు టెర్రరిస్టులు ప్రయత్నిస్తున్నారు. కశ్మీర్ లోయలోని పలు పర్యాటక కేంద్రాలు , శ్రీనగర్, గుల్మార్గ్ , పహల్గామ్ వంటి ప్రాంతాలలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని, అక్కడికి వెళ్లితే ముప్పు తప్పదని పౌరులకు విజ్ఞప్తి చేశారు. అమెరికా విదేశాంగ శాఖ నుంచి ఈ అడ్వయిజరీ వెలువడిరది.



# నీతికథలతో పిల్లల్లో మనోవికాసం !

కథలు చెప్పడం అనాదిగా వస్తున్న సదాచారం. చిన్నతనంలో పిల్లలు అన్నం తినడానికి మారాం చేస్తే ''అనగనగా ఒక రాజు'' అంటూ నీతి కథలు చెప్పేవాళ్లు. అమ్మ, నాన్న, తాత, నాన్నమ్మ లేదా అమ్మమ్మలు కథలు చెబితే జోలపాట వలె వింటూ నిద్రలోకి జారుకునే వారు చంటి పిల్లలు. అమ్మమ్మ కథలు పిల్లల జీవితాలను మార్చుతాయని సామెత కూడా ఉన్నది. నేటి డిజిటల్ యుగంలో కథలు చెప్పే ఓపిక పెద్దలకు, కథలు వినే శ్రద్ధ పిల్లల్లో క్రమంగా తగ్గుతోంది. అన్ని వయస్సుల వారికి కథలు వినడం చాలా ఇష్టంగా ఉండేది. ముఖ్యంగా పిల్లలు నీతి కథలు, నాటి చందమామ కథలు, అలనాటి బాలమిత్ర కథలు వినడానికి ఆసక్తి చూపే వారు. నాటి ఉమ్మడి కుటుంబాల్లో తాతలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు ఆయా కుటుంబాల్లోని పిల్లలు, యువతకు రామాయణ మహాభారత కథలను ఆసక్తికరంగా వివరించే వారు. ఆ కథలను జీర్ణించుకున్న పిల్లలు తమ మనో విస్తృతిని పెంచుకుంటూ సన్మార్గంలో నీతి నియమాల చట్రంలో గౌరవంగా జీవించే ప్రయత్నాలు చేసేవారని మనకు తెలుసు. తరతరాలుగా కథలు ఒకరి నుంచి మరొకరికి చెప్పబడుతూనే ఉన్నాయి, విలువల బోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఇలా రాబోయే తరానికి జీవన విలువలను పరిచయం చేయడానికి కథలు చెప్పడం ఎంత ముఖ్యమో తెలపడానికి ప్రతి ఏట ఏప్రిల్ 27న ''జాతీయ కథలు చెప్పే దినోత్సవం'' లేదా ''నేషనల్ టెల్ ఏ స్టోరీ''ని పాటించడం ఆనవాయితీగా మారింది.కథలు అనేక రకాలుగా ఉంటాయి. మనం ఒక పుస్తకం చదివి లేదా మన అనుభవం నుంచి తెలుసుకొని మరో తరానికి చెప్పడం పెద్దల బాధ్యత అని మరువరాదు. చిన్నతనంలో విన్న పిల్లలు కథలు చెరగని ముద్రలు వేస్తూ జీవితాంతం వారికి మార్గనిర్దేశనం చేస్తాయి. మన బంధువుల్లో లేదా మిత్రుల కుటుంబాలకు చెందిన పిల్లలు, యువతతో నీతి కథలు పంచుకోవడం ఒక సదాచారమే కాదు అది వారి జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. కథలు చెప్పడం వల్ల చెప్పిన వారికి, విన్న వారికి మధ్య సత్సంబంధాలు నెలకొంటాయి. అమెరికాలో ప్రారంభమైన ''జాతీయ కథలు చెప్పే దినం'' సందర్భంగా ప్రజలు కథలు ఇతరులకు పంచుకోవడం వల్ల భావోద్వేగాల నియంత్రణ కమ్యూనికేషన్, క్రియేటివిటీ, అవగాహన, ఆత్మవిశ్వాసం, మనో విస్తృతి, ఒకరినొకరు కనెక్ట్ కావడం, సామాజిక వాతావరణం సృష్టించడం, ఆలోచనాశక్తి పెరగడం, విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించబడడం, భాషపై పట్టు, ప్రేరణ, కొత్త పరిచయాలు, సృజనాత్మక, వినడమనే సుగుణం, సంస్కృతీ వారసత్వాల వితరణ, వాక్కు, కొత్త ఆలోచనలు పురుడు పోసుకోవడం, దయ/సహానుభూతి, ఆశావహ దృక్పథం, ప్రపంచాన్ని చూసే దృక్కోణం, ఇతర నైపుణ్యాలు లాంటివి పెరుగుతాయి. కథలు చెప్పడంలో మౌఖిక, డిజిటల్, దృశ్య, వ్రాత పూర్వక రూపాలు ఉన్నాయి. సినిమాలు, పుస్తకాలు, కవితలు, పాటలు, పెయింటింగ్‌లు కూడా కథలు చెప్పే రూపాల్లోకి వస్తాయి. మౌఖిక కథలు చెప్పడం అంటే పురాణ పద్యాలు, శ్లోకాలు, ప్రాసలు, పాటలు లాంటి రూపాలు ఉండవచ్చు. కథలు చెప్పడం పట్ల మక్కువ ఉంటే అనేక కెరీర్ అవకాశాలు (స్క్రీన్ రైటర్, సృజనాత్మక రచయిత, సినీ దర్శకులు, వీడియో గేమ్ రచయితలు, కంటెంట్ స్ట్రాటజిస్టులు, పాడ్‌కాస్ట్ నిర్మాతలు, స్టోరీబోర్డ్ కళాకారులు, యానిమేటర్స్ లాంటి) కూడా ఉంటాయి. ఒకప్పుడు మనుషులు మాత్రమే చెప్పే కథలను నేడు ఏఐ విప్లవంతో ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా చెప్పడం చూస్తున్నాం. సాంకేతికత, సృజనాత్మకత కలయికతో ఏఐ తన పరిధిని విస్తరిస్తోంది. ఇది మరింత గొప్ప, వైవిధ్యమైన కథనాలకు దారి తీస్తున్నది. తల్లితండ్రులు, పెద్దలు తమ డిజిటల్ ప్రపంచపు నీలి తెరల్లోంచి కొంత సమయం తీసుకొని తమ పిల్లలకు కథలు చెప్పడానికి వెచ్చించాలి. పిల్లల్లో వినే కళను కూడా పెంచండి. నేటి పెద్దలు కొంత వరకు తమ పిల్లలకు కథలు చెప్పడం నేర్చుకోవాలి. కథలను వింటూ ఎదిగిన పిల్లల వ్యక్తిత్వం ఇతర పిల్లల కన్న విలక్షణంగా ఉంటుందని గమనించాలి.

# మేధా పాట్కర్ అరెస్టు, విడుదల

**న్యూఢిల్లీ:** సామాజిక కార్యకర్త మేధా పాట్కర్‌ను శుక్రవారం ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా వున్న వి.కె.సక్సేనా 24ఏళ్ల క్రితం దాఖలు చేసిన ఒక పరువు నష్టం కేసులో ఏప్రిల్ 23న సాకేత్ కోర్టు మేధా పాట్కర్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో శుక్రవారం ఉదయం ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు ఆదేశాల మేరకు రూ. లక్ష జరిమానా చెల్లించడంతో సాయంత్రం 4:30 గంటలకు మేధా పాట్కర్ విడుదలయ్యారు. 2000 సంవత్సరంలో వి.కె.సక్సేనా దాఖలు చేసిన పరువునష్టం కేసులో మేధాపాట్కర్‌ను గతేడాది జులైలో దోషిగా నిర్ధారించారు. అనంతరం ఆమె ప్రొబేషన్‌పై విడుదలయ్యారు. ఈ నెల 8న జరిగిన ఈ కేసు విచారణలో మేధాపాట్కర్ 23వ తేదీన కోర్టుకు హాజరుకావాలని, ప్రొబేషన్ బాండ్లు, రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించారు. 70 ఏళ్ల మేధాపాట్కర్ ఆ రోజున కోర్టుకు హాజరుకాలేకపోయారు. దీంతో జడ్జి పాట్కర్‌కు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారు. తదుపరి విచారణ మే 3వ తేదీ నాటికి మేధాపాట్కర్ తమ ఆదేశాలను పాటించాలని జడ్జి స్పష్టం చేశారు. నర్మదా బచావో ఉద్యమం సమయంలో గుజరాజ్‌లో ఒక ఎన్‌జిఓకు సక్సేనా చీఫ్‌గా ఉన్నారు. ఆ సమయంలో తన పరువుకు నష్టం కలిగించే విధంగా మేధాపాట్కర్ వ్యాఖ్యలు చేశారని సక్సేనా ఈ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. హైకోర్టులో అప్పీలు పెండింగ్‌లో ఉన్నందున విచారణను వాయిదా వేయాలని కోరుతూ మేధాపాట్కర్ తరపు న్యాయవాది అంతకుముందు ఒక దరఖాస్తును దాఖలు చేశారు. కోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సింధూ జలాలు అడ్డుకోవడం యుద్ధప్రకటనే



పహల్గామ్ దారుణ దాడి తర్వాత భారత ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యల నేపథ్యంలో మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో తాము ప్రతిస్పందించాలని పాకిస్తాన్ నిర్ణయించింది. దీంతో పాక్ భద్రతా వ్యవహారాల అత్యున్నత కమిటీ గురువారం సమావేశమై గంటల తరబడి చర్చించి భారతదేశంతో ప్రస్తుతం ఉన్న సిమ్లా ఒప్పందంతో సహా అన్న ఒప్పందాలనూ ప్రస్తుతానికి రద్దుచేసుకోవాలని నిర్ణయించింది. భారతదేశం పాకిస్తానీ పౌరులకు అన్ని వీసాలను రద్దు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇస్లామాబాద్ కూడా సార్క్ వీసా మినహాయింపు పథకం కింద భారతీయులకు జారీ చేసిన పర్మిట్లను నిలిపివేయాలని నిర్ణయించింది. హైకమిషన్ లోని భారత దౌత్య సిబ్బంది సంఖ్యను 30కి కుదించాలని నిర్ణయించింది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలన్న భారత నిర్ణయాన్ని మాత్రం పాకిస్తాన్ జీర్ణించుకోలేకపోయింది. దీనిని చావుదెబ్బగా భావించిన ఇస్లామాబాద్ మరో గత్యంతరం లోని పరిస్థితుల్లో ఈ ఒప్పందం ప్రకారం పాక్ కు నీటి ప్రవాహాన్ని నిలిపివేయడం నదీజలాల హక్కుల అతిక్రమణగా పేర్కొంది. దీనిని యుద్ధ చర్య గా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. దీనిపై నేషనల్ పవర్ స్పెక్ట్రం స్పందిస్తుందని మాత్రం పేర్కొంది. పాక్ లో ప్రవహించే సింధు, జీలం, చీనాబ్.. జలాలు పారకపోతే.. సగం దేశం ఎడారిగా తయారవుతుంది. కోట్లాది మంది పై దీని ప్రభావం పడుతుంది. ఇప్పటికే పాకిస్తాన్ లో తీవ్రమైన నిటి కొరత ఉంది. భారత్ అశనిపాతం వంటి నిర్ణయంతో పాకిస్తాన్ కు చావుదెబ్బ తప్పదు. కానీ, పాకిస్తాన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించింది. సిమ్లాతో సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాల నిలిపివేత పాకిస్తాన్ హక్కుగా పేర్కొంది. కానీ, భారతదేశం తన నిర్ణయాలని విరమించుకునే వరకూ తాము సిమ్లా ఒప్పందంతో సహా అన్ని ఒప్పందాలను రద్దు చేసుకునే హక్కును వినియోగించుకొంటున్నట్లు పాక్ ఒక ప్రకటనలో తెలిపింది.

‘ఆ’ పిటిషన్లను తోసిపుచ్చండి

# వక్ఫ్ సవరణ చట్టాన్ని సుప్రీంలో సమర్ధించుకున్న కేంద్రం



**న్యూఢిల్లీ:** వక్ఫ్ (సవరణ) చట్టం, 2025 చెల్లుబాటును సవాలు చేస్తున్న పిటిషన్లను తోసిపుచ్చాలని కేంద్రప్రభుత్వం శుక్రవారం సుప్రీం కోర్టును కోరింది. రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు అవుతుందని భావిస్తున్నందున ఈ చట్టంపై స్టే విధించలేరని పేర్కొంది. 1,332 పేజీల ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌ను అందచేసిన ప్రభుత్వం వివాదాస్పదమైన ఈ చట్టాన్ని పూర్తిగా సమర్ధించుకుంది. 2013 తర్వాత, దిగ్భ్రాంతి కలిగించే రీతిలో ఏకంగా 20లక్షల హెక్టార్ల (కచ్చితంగా 20,92,072.536 ఎకరాలు) కు పైగా భూములు వక్ఫ్ భూమిగా చేర్చబడ్డాయని పేర్కొంది. మొఘల్ శకానికన్నా ముందు, స్వాతంత్ర్యం ముందు నాటి కాలం, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్‌లో మొత్తంగా 18,29,163.896 ఎకరాల భూములు వక్ఫ్ భూములుగా మారాయని అఫిడవిట్ పేర్కొంది. గతంలోని నిబంధనలను దుర్వినియోగం చేసి ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించు కున్నారని పేర్కొంది. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ షేర్షా సి.షేక్ మొహియుద్దీన్ ఈ అఫిడవిట్ దాఖలు చేశారు. ''చట్టబద్ధమైన నిబంధనలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రాజ్యాంగ న్యాయస్థానాలు నిలిపివేయ బోవని, ఆ అంశాన్ని తుదికంటా నిర్ణయిస్తాయని చట్టంలో ఒక స్పష్టమైన వైఖరి వుంది. పార్లమెంట్ చేసిన చట్టాలకు రాజ్యాంగబద్ధత వుంటుందనే భావన వుంది.'' అని అఫిడవిట్ పేర్కొంది. మతపరమైన స్వేచ్ఛ వంటి ప్రాథమిక హక్కులను లాక్కునేలా సవరణలు చేశారనే తప్పుడు ప్రాతిపదికలపై ఈ పిటిషన్లు దాఖలయ్యాయని ఆ అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొంది. కావాలంటే శాసన సామర్ధ్యం, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన వంటి అంశాల ప్రాతిపదికన రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద న్యాయస్థానాలు ఒక చట్టాన్ని సమీక్షించవచ్చని తెలిపింది. ప్రధాన రాజకీయ పార్టీల సభ్యులతో ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ప్యానెల్‌తో కూలంకషంగా, విశ్లేషణాత్మకంగా, సమగ్రంగా అధ్యయనం జరిపిన తర్వాతనే ప్రభుత్వం ఈ సవరణలు చేసిందని ఆ అఫిడవిట్ పేర్కొంది. మతపరమైన స్వయంప్రతిపత్తిని ఉల్లంఘించకుండా, విశ్వసనీయులు, సమాజం పెట్టిన నమ్మకాన్ని పరిరక్షించుకునే పద్ధతిలో వక్ఫ్ వంటి మతపరమైన సంస్థలను నిర్వహించేందుకు హామీ కల్పిస్తూ పార్లమెంట్ తన పరిధిలో చర్యలు తీసుకుందని పేర్కొంది.



# ప్రజా ఐక్యతను రక్షించడానికి కృషి

**న్యూఢిల్లీ:** జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన క్రూరమైన ఉగ్రదాడిని సిఐటియు తీవ్రంగా ఖండిరచింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ దారుణమైన దాడి ఉగ్రవాదం నుంచి వచ్చే నిరంతర ముప్పును, శాంతిసామరస్యంపై దాని వినాశకరమైన ప్రభావాన్ని స్పష్టంగా గుర్తు చేస్తోందని ఈ ప్రకటనలో సిఐటియు గుర్తు చేసింది. పర్యాటకులపై దాడి కారణంగా పర్యాటకం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడిన అనేక మంది శ్రామిక ప్రజల జీవనోపాధి నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ దు:ఖ సమయంలో జమ్మూకాశ్మీర్ ప్రజలకు సిఐటియు సంఫీుభావం ప్రకటించింది. భయంకరమైన, అనాగరిక నేరానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కేంద్రాన్ని సిఐటియు డిమాండ్ చేసింది. దాడి నేపథ్యంలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఉన్న జమ్మూకాశ్మీర్‌కు చెందిన విద్యార్థులు, వ్యాపారులు, కార్మికులపై విభజన శక్తులు బెదిరింపులు, వేధింపులకు పాల్పడుతున్నట్లు వస్తున్న వార్తలపై సిఐటియు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదుల హింసను కాశ్మీర్ సమాజం ఏకగ్రీవంగా ఖండిరచినా వారిని లక్ష్యంగా చేసుకుని దుర్మార్గపు ప్రచారం జరుగుతుందని సిఐటియు తెలిపింది. జమ్మూకాశ్మీర్ ప్రజలపై బెదిరింపులు, హింసాత్మక చర్యలు ఆమోద యోగ్యం కావని, విభజన శక్తులు చేసే ఇటువంటి దుష్ట కార్యకలాపాలు ఉగ్రవాదుల ఎజెండాకు మాత్రమే సహాయపడతాయని సిఐటియు హెచ్చరించింది. ఇటువంటి సమయంలో ప్రజల ఐక్యతను రక్షించడానికి, ఉగ్రవాదుల విధ్వంసక కార్యకలాపాలను ఎదుర్కొనడానికి కృషి చేయాలని సిఐటియు తన కార్యకర్తలు, సభ్యులు, కార్మికులు, సామాన్య ప్రజలకు పిలుపునిచ్చింది. అన్ని ప్రగతిశీల, ప్రజాస్వామ్య సంఘాలు అప్రమత్తంగా, ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చింది.

# కుప్పకూలిన పోలీస్ విమానం..

థాయ్‌లాండ్‌లోని ప్రముఖ బీచ్ నగరంలో పోలీసుల విమానం కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న ఐదుగురు మరణించినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. పారాచ్యూట్ శిక్షణనిచ్చేందుకు విమానం టెస్ట్ ఫ్లైట్ నిర్వహిస్తుండగా ఉదయం 8.00 గంటల సమయంలో కూలిపోయిందని రాయల్ థాయ్ పోలీస్ ప్రతినిధి అర్చాయన్ క్రైథాంగ్ వెల్లడిరచారు. హువాహిన్ విమానాశ్రయ సమీపంలో విమానం కూలిపోయినట్లు తెలిపారు. ప్రమాద సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారని, ఘటనా స్థలంలో ఐదుగురు మరణించారని థాయ్ పోలీస్ ప్రతినిధి అర్చాయన్ ప్రకటించారు . మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదని అన్నారు. విమానం బ్లాక్ బాక్స్ సమాచారం సహా మిగిలిన ఆధారాలు సేకరిస్తున్నారని ఆయన తెలిపారు. వికింగ్ డిహెచ్‌సి 6 ట్విన్ ఒటర్ విమానం సముద్రంలో కూలిపోయిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. సముద్రం ఒడ్డు నుండి సుమారు 100 మీ దూరంలో విమానం కూలిపోగా, రెండు ముక్కలుగా విరిగిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

# అమెరికా కోసమే దశాబ్దాలుగా ఈ దరిద్రపు పని




**లండన్:** పాశ్చాత్య దేశాల కోసం తమ దేశం ఉగ్రవాదుల సంస్థలకు దన్నుగా నిలుస్తున్నదని. శిక్షణ ఇస్తున్నదని, నిధులు సమకూరుస్తున్నదని పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ అంగీకరించారు. ఈ తప్పిదం పాకిస్తాన్‌కు చేటు తెచ్చిందని ఆయన చెప్పారు. పహల్‌గామ్‌ల ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్తాన్ స్పందన, ఉగ్రవాదం పై వైఖరి గురించి స్కై న్యూస్‌కు ఇంటర్వ్యూలో పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఆసిఫ్‌ను న్యూస్ ప్రెజెంటర్ యాల్దా హకీమ్ ప్రశ్నించారు. ఇటీవల పహల్‌గామ్‌లో ఉగ్ర దాడిలో 26 మంది వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ‘సార్, ఈ ఉగ్ర సంస్థలను సమర్థిస్తున్న, శిక్షణ, నిధులు ఇస్తున్న సుదీర్ఘ చరిత్ర పాకిస్తాన్‌కు ఉందని అంగీకరిస్తారా’ అని హకీమ్ అడిగారు. ‘నిజమే. మూడు దశాబ్దాలుగా యునైటెడ్ స్టేట్స్, బ్రిటన్‌తో సహా పాశ్చాత్య దేశాల కోసం మేము ఈ దరిద్రపు పని సాగిస్తున్నాం’ అని ఆసిఫ్ సమాధానం ఇచ్చారు. ‘అది పొరపాటే. దాని వల్ల మేము నష్టపోయాం. అందుకు మీరు నాతో ఇలా అంటున్నారు. మేము సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా, ఇంకా 9/11 తరువాత యుద్ధంలో మేము చేరి ఉండకపోతే, పాకిస్తాన్‌ది తిరుగులేని ట్రాక్ రికార్డు’ అని ఆయన అన్నారు. ‘ఈ ప్రాంతంలో ఏమి సంభవించినా పాకిస్తాన్‌ను నిందించడం అగ్ర రాజ్యాలకు ఎంతో సౌకర్యంగా ఉంటున్నది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా 19810 దశకంలో వారి పక్షాల పోరాడినప్పుడు, ఈనాటి ఈ ఉగ్రవాదులు వాషింగ్టన్‌లో విందు చేశారు. ఆతరువాత 9/11 దాడులు జరిగాయి. మళ్లీ అదే పరిస్థితి వచ్చింది. అప్పట్లో మా ప్రభుత్వం పొరపాటు చేసిందని నా భావన’ అని ఆయన తెలిపారు. ఆ సమయంలో పాకిస్తాన్‌ను ‘పావుగా ఉపయోగించుకున్నారు’ అని ఆసిఫ్ అన్నారు. పహల్‌గామ్‌లో మంగళవారం నాటి ఉగ్ర వాడికి, దాడికి తన బాధ్యత ఒప్పుకున్న నిషిద్ధ లష్కరె తయ్యిబా (ఎల్‌ఇటి) అనుబంధ సంస్థ ‘ది రెసిస్టెన్స్ ఫ్రంట్’ (టిఆర్‌ఎఫ్)కు పాకిస్తాన్‌ను నిందిస్తుండడం గురించి మంత్రిని ప్రశ్నించారు. ‘పాకిస్తాన్‌లో లష్కరె తయ్యిబా ఇక ఎంత మాత్రం ఉనికిలో లేదు. అది అంతరించింది. మాతృ సంస్థ ఉనికిలో లేనప్పుడు అనుబంధ సంస్థ ఇక్కడ ఎలా ఊపిరి పోసుకుంటుంది’ అని ఆసిఫ్ అన్నారు. పహల్‌గామ్ ఉగ్ర దాడి ఫలితంగా పరిస్థితులు విషమిస్తాయని పాకిస్తాన్ భయపడుతోందా అని ప్రశ్నించినప్పుడు సముచిత రీతలో స్పందించేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని మంత్రి ఆసిఫ్ సమాధానం ఇచ్చారు.

## పోలీసుల అదుపులో 450మంది పైగా అక్రమ వలసదారులు

అహ్మదాబాద్‌లో 450 మందికి పైగా అక్రమ వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం తెల్లవారుజామున నగరంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన కూంబింగ్ ఆపరేషన్ తర్వాత అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ క్రైమ్ బ్రాంచ్ డిప్యూటీ కమిషనర్ అజిత్ రాజియాన్ తెలిపారు. వీరిలో ఎక్కువ మంది బంగ్లాదేశ్ నుండి వచ్చినవారు ఉన్నట్లు తెలిపారు. ‘‘450 మందికి పైగా అక్రమ వలసదారులు, ఎక్కువగా బంగ్లాదేశ్ నుండి వచ్చిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాము. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా దొరికితే, వారిని బహిష్కరిస్తాము’’ అని ఆయన అన్నారు. ఈ ఆపరేషన్‌ను అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, ఆర్థిక నేరాల విభాగం మరియు జోన్ 6, పోలీసు ప్రధాన కార్యాలయానికి చెందిన పోలీసు సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారని రాజియాన్ చెప్పారు. విచారణ నిమిత్తం వీరిని కంకారియా ఫుట్‌బాల్ మైదానంలో ఉంచినట్లు ఆయన చెప్పారు.

కారుబాంబు పేలుడుకు

# బలైన రష్యా జనరల్



మాస్కో సమీపాన శుక్రవారం కారు బాంబు పేలుడులో అగ్రస్థాయి రష్యా జనరల్ ప్రాణాలు కోల్పోయారు. ఇది ఉగ్రవాద దాడిగా రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ వెల్లడిరచింది. రష్యా రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన మెయిన్ ఆపరేషన్స్ డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ స్టాఫ్ డిప్యూటీ డెరెక్టర్ లెఫ్టినెంట్ జనరల్ 59 ఏళ్ల యారోస్లోవ్ మొస్కాలిక్ హతులయ్యారని దర్యాప్తు కమిటీ వెల్లడిరచిందని వెస్టీ ఎఫ్‌ఎం రేడియో వివరించింది. కారు పక్కనే ఉంచిన ఓ గ్యాస్ సిలిండర్‌లో బాంబును పెట్టి దానిని రిమోట్ సాయంతో పేల్చివేసినట్టు గుర్తించారు. ఈ దాడికి కారకులెవరో ఇంకా తెలియరాలేదు. సంఘటన స్థలంలో పడి ఉన్న పేలుడు పరికరం తునకలను పరీక్షకు పంపినట్టు దర్యాప్తు కమిటీ అధికార ప్రతినిధి స్వెత్లానా పెటెరెన్‌కో చెప్పారు. మొస్కాలిక్ రక్షణ మంత్రిత్వశాఖ ప్రతినిధిగా అనేక చర్చల్లో పాల్గొనేవారు. రష్యా సైన్యం నిర్వహించే ప్రధాన ఆపరేషన్ల విషయంలో డైరెక్టరేట్ చీఫ్‌కు యారొస్లోవ్ సహాయ కారిగా ఉంటారు. ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధలోకూడా ఆయనది చాలా కీలక పాత్ర. శుక్రవారం నాడు క్రెమ్లిన్‌తో అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కోఫ్ చర్చలు జరగనున్న సమయంలో ఈ సంఘటన జరగడం చర్చనీయాంశం అయింది. ఉక్రెయిన్ క్యాంపైన్‌తో సంబంధం ఉన్న అనేక రష్యా మిలిటరీ అధికారులు తమ ఇళ్ల వద్దే హత్యకు గురవుతున్నారని ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ ఎస్‌బియు ఏజెంట్లు ఆరోపించారు. ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే అంశంపై చర్చలు జరిపేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ మాస్కోకు వెళ్లారు. ఈ విషయాన్ని ఇంటర్ ఫాక్స్ న్యూస్ ఏజెన్సీ ధ్రువీకరించింది. ఈ పర్యటనలో భాగంగా ఆయన రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే దీనిని ఇప్పటివరకు క్రెమ్లిన్ వర్గాలు ధ్రువీకరించలేదు. యుద్ధానికి పరిష్కారం కోసం ఇప్పటికే విట్కాఫ్ మూడుసార్లు మాస్కోను సందర్శించారు. ఫిబ్రవరి 11, మార్చి 13, ఏప్రిల్ 11న ఆయన పుతిన్‌తో మాట్లాడారు. ఈ చర్చల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో పురోగతి కనిపిస్తోందని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

# మేథా పాట్కర్ అరెస్టు, విడుదల

**న్యూఢిల్లీ:** సామాజిక కార్యకర్త మేథా పాట్కర్‌ను శుక్రవారం ఢల్లీి పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఢల్లీిలెఫ్టినెంట్ గవర్నర్‌గా వున్న వి.కె.సక్సేనా 24ఏళ్ల క్రితం దాఖలు చేసిన ఒక పరువు నష్టం కేసులో ఏప్రిల్ 23న సాకేత్ కోర్టు మేథా పాట్కర్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో శుక్రవారం ఉదయం ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు ఆదేశాల మేరకు రూ. లక్ష జరిమానా చెల్లించడంతో సాయంత్రం 4:30 గంటలకు మేథా పాట్కర్ విడుదలయ్యారు. 2000 సంవత్సరంలో వి.కె.సక్సేనా దాఖలు చేసిన పరువునష్టం కేసులో మేథాపాట్కర్‌ను గతేడాది జులైలో దోషిగా నిర్ధారించారు. అనంతరం ఆమె ప్రొబేషన్‌పై విడుదలయ్యారు. ఈ నెల 8న జరిగిన ఈ కేసు విచారణలో మేథాప్కాటర్ 23వ తేదీన కోర్టుకు హాజరుకావాలని, ప్రొబేషన్ బాండ్లు, రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించారు. 70 ఏళ్ల మేథాపాట్కర్ ఆ రోజున కోర్టుకు హాజరుకాలేకపోయారు. దీంతో జడ్జి పాట్కర్‌కు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారు. తదుపరి విచారణ మే 3వ తేదీ నాటికి మేథాపాట్కర్ తమ ఆదేశాలను పాటించాలని జడ్జి స్పష్టం చేశారు. నర్మదా బచావో ఉద్యమం సమయంలో గుజరాజ్‌లో ఒక ఎన్‌జిఓకు సక్సెనా చీఫ్‌గా ఉన్నారు. ఆ సమయంలో తన పరువుకు నష్టం కలిగించే విధంగా మేథాపాట్కర్ వ్యాఖ్యలు చేశారని సక్సేనా ఈ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. హైకోర్టులో అప్పీలు పెండిరగ్‌లో ఉన్నందున విచారణను వాయిదా వేయాలని కోరుతూ మేథాపాట్కర్ తరపు న్యాయవాది అంతకుముందు ఒక దరఖాస్తును దాఖలు చేశారు. కోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

# పాక్ జాతీయులను గడువులోగా పంపండి



**న్యూఢిల్లీ:** గడువులోగా పాకిస్తానీయులందరూ దేశం విడిచి వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశించారు. శుక్రవారం నాడు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన ఫోన్ చేసి మాట్లాడారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సార్క్ వీసా పొడిగింపు పథకం కింద గతంలో చాలామంది పాక్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశాలు కల్పించారు. తాజా పరిణామాల నేపథ్యంలో వారందరూ 48గంటల్లోగా దేశాన్ని విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 27వ తేదీలోగా పాక్ జాతీయుల వీసాల రద్దయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీర్ఘకాల వీసాలు, దౌత్య, అధికారిక వీసాలు మినహా పాక్ జాతీయులందరికీ జారీ అయిన వీసాలను ప్రభుత్వం రద్దు చేసింది. 27నుండి ఇవి అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకుంది. మెడికల్ వీసాలు 29వరకు మాత్రమే అమల్లో వుంటాయి. పాకిస్తాన్‌కు ఒక చుక్క నీరు కూడా వెళ్లకుండా వుండేలా చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ తెలిపారు. సింధు నది నుండి ఒక్క చుక్కను కూడా పాక్‌ను చేరబోనివ్వబోమని ఆయన ఎక్స్‌లో శుక్రవారం పోస్టు పెట్టారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# రెట్రో ప్రయాణం అంత ఈజీ కాదు



మే 1 వచ్చేస్తోంది. అందరి చూపు నాని హిట్ 3 ది థర్డ్ కేస్ మీదే ఉంది. అంచనాలకు తగ్గట్టే జరుగుతున్న ప్రమోషన్లు ఆడియన్స్ లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఇప్పటి దాకా ఒకే ట్రైలర్ తో సరిపెట్టిన దర్శకుడు శైలేష్ కొలను అన్ని సర్ప్రైజ్ లు థియేటర్లో చూడమని ఊరిస్తున్నాడు. ఇదిలా ఉండగా అదే రోజు వస్తున్న సూర్య రెట్రోకి బజ్ అంతగా లేకపోవడం అభిమానులను టెన్షన్ పెడుతోంది. ముఖ్యంగా ట్రైలర్ వల్ల కొంచెం అయోమయం కలగడం మాస్ వర్గాల్లో హైప్ తగ్గించింది. కంగువ డిజాస్టర్ ఎఫెక్ట్ స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవేళ నాని కనక రేసులో లేకపోయి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేమో కానీ ఇప్పుడలా కాదు.రెట్రోని డిస్ట్రిబ్యూట్ చేస్తున్న సితార సంస్థ ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం తమ కింగ్ డమ్ హీరో విజయ్ దేవరకొండని గెస్టుగా తీసుకొస్తోంది. ఈ వేడుకలో ఏమైనా మెరుపులు ఉంటాయేమో చూడాలి. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ గత సినిమా జిగర్ తండా డబుల్ ఎక్స్ తెలుగులో ఆడలేదు. యావరేజ్ అయినా ఏమో అనుకోవచ్చు కానీ డిజాస్టర్ కొట్టింది. అంతకు ముందు మహాన్ ఓటిటిలో వచ్చింది. జగమే తంతిరంకు పూర్ కంటెంట్ అంటూ విమర్శలు వచ్చి పడ్డాయి. పేట ఒక్కటే డీసెంట్ గా ఆడిరది. దీంతో రెట్రోకి టాలీవుడ్ లో డైరెక్టర్ బ్రాండ్ పని చేయడం లేదు. మొత్తం బరువు సూర్య మీదే పడుతోంది. బిజినెస్ కి కూడా అతనే కీలకం. హిట్ 3 కనక హిట్ టాక్ తెచ్చుకుంటే రెట్రోకి ఇబ్బందులు తప్పవు. అసలే మండే ఎండల్లో జనం ఆచితూచి థియేటర్లకు వస్తున్నారు.



# ప్రభాస్ కల్కి... శ్రద్ధ శ్రీనాథ్ కలియుగమ్

న్యాచురల్ స్టార్ నాని జెర్సీతో తెలుగులో పేరు సంపాదించుకున్న హీరోయిన్ శ్రద్ధ శ్రీనాథ్‌కు తర్వాత అవకాశాలు పెద్ద మోతాదులో రాలేదు. కృష్ణ అండ్ హిజ్ లీల లాంటివి కొంచెం ఇమేజ్ తెచ్చినప్పటికీ సరైన బ్రేక్ రాకపోవడంతో చాలా త్వరగానే వెంకటేష్ లాంటి సీనియర్ హీరోకు జోడిగా నటించాల్సి వచ్చింది. అయితే సైంధవ్ ఆశించిన ఫలితం ఇవ్వలేకపోయింది. అందుకే మెకానిక్ రాకీ, డాకు మహారాజ్ లో సపోర్టింగ్ రోల్స్ కు సైతం ఎస్ చెప్పింది. చాలా సంవత్సరాల తర్వాత తనో ప్రధాన పాత్రలో ఒక ప్యాన్ ఇండియా మూవీ వస్తోంది. అదే కలియుగమ్ 2064. వచ్చే మే 9 విడుదలకు రెడీ అవుతోంది. ఇవాళ ట్రైలర్ వచ్చింది. రెండు నిమిషాల వీడియోలో కథ దేని దేని గురించో చెప్పారు. 2064 సంవత్సరంలో ప్రపంచం మొత్తం అంతరించిపోయి అతి కొద్ది మానవాళి మిగులుతుంది. తిండి, బట్ట అపురూపంగా మారిపోయి వాటి కోసం యుద్ధాలు, హత్యలు చేసే పరిస్థితులు తలెత్తుతాయి. అలాంటి స్మశాన వైరాగ్యం ఉన్న చోట శ్రద్ధ శ్రీనాథ్, కిషోర్ చిక్కుకుంటారు. సాటివాళ్ళ కోసం ఏదైనా తీసుకెళదామనే పోరాటంలో కొత్త శక్తులతో తలపడాల్సి వస్తుంది. అదేంటో స్క్రీన్ మీద చూడాలి. కల్కి 2898 ఏడికి దీనికి కథ పరంగా సంబంధం తక్కువే అయినా కొన్ని సారూప్యతలు కనిపిస్తున్నాయి. రెండు కలియుగం చివరి అంకాన్ని అంటే భవిష్యత్తుని ఆధారంగా చేసుకున్నావే. కాకపోతే కల్కిలో తెరనిండా ఆరిస్టులు ఉంటే కలియుగమ్ లో తక్కువ క్యాస్టింగ్ కనిపిస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్, హాలీవుడ్ తరహాలో నో మ్యాన్స్ ల్యాండ్ వాతావరణం అన్నీ డిఫరెంట్ గా ఉన్నాయి.



# క్రేజీ కలయిక రామ్ కోసం ఉపేంద్ర ?

వరస ఫ్లాపులతో సతమతమవుతున్న ఎనర్జిటిక్ స్టార్ రామ్ ఆశలన్నీ ఇప్పుడు రాబోయే సినిమా మీదే ఉన్నాయి. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ మహేష్ బాబు దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్ టైనర్ షూటింగ్ ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్విఘ్నంగా జరిగిపోతోంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ పెద్ద బడ్జెట్ తో నిర్మిస్తోంది. 'ఆంధ్రా కింగ్ తాలూకా' టైటిల్ ప్రచారంలో ఉంది కానీ యూనిట్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. మే 15 రామ్ పుట్టినరోజు రాబోతున్న నేపథ్యంలో టీజర్ తో పాటు పేరుని ప్రకటించాలా వద్దానే మీమాంస కొనసాగుతోంది.ఇదిలా ఉండగా ఇందులో ఒక కీలకమైన పాత్ర కోసం సీనియర్ హీరో అవసరం ఉందనేది ముందు నుంచి ప్రచారంలో ఉన్న లీక్. తొలుత మోహన్ లాల్ అనుకుని కథ కూడా వినిపించారట. ఆయన సానుకూలంగా స్పందించినట్టు టాక్ వచ్చింది. కానీ తర్వాత ఏవో కారణాల వల్ల లాలెట్టన్ బదులు ఉపేంద్రతో సంప్రదింపులు జరుపుతున్నట్టు లేటెస్ట్ అప్డేట్. ఇంకా అధికారికంగా ప్రకటించలేదు కానీ స్టోరీకి సంబంధించి డిస్కషన్స్ చేసినట్టు తెలిసింది. ఈ మధ్య తన పాత్రకు ప్రాధాన్యం ఉందని తెలిస్తే క్యామియోలు చేయడానికి ఉపేంద్ర వెనుకాడటం లేదు. రజనీకాంత్ కూలి, శివరాజ్ కుమార్ 45 అందుకే ఒప్పుకున్నారు. ఉపేంద్ర తెలుగు స్ట్రెయిట్ సినిమా చివరిసారి చేసింది వరుణ్ తేజ్ గనిలో. అది డిజాస్టర్ కావడంతో ప్రేక్షకులకు గుర్తు లేకుండా పోయింది. ఇప్పుడు రామ్ తో కనక జట్టుకడితే మంచి కాంబో అవుతుంది.




# శ్రీనిధి శెట్టికి భలే ఛాన్స్ దొరికింది

కెజిఎఫ్ తర్వాత సరైన అవకాశాలు రాక, వచ్చినా కోబ్రా లాంటివి ఆశించిన స్థాయిలో ఆడలేక ఇబ్బంది పడుతున్న శ్రీనిధి శెట్టికి హిట్ 3 రూపంలో భలే ఛాన్స్ దొరికింది. కథ ప్రకారం చూసుకుంటే తన పాత్రకు ప్రాధాన్యం ఉండొచ్చేమో కానీ కథ కోణంలో చూస్తే వయొలెన్స్ నిండిన ఇంత ఇంటెన్స్ డ్రామాలో ఆమెకు పెర్ఫార్మన్స్ పరంగా ఎక్కువ స్కోప్ దొరక్కపోయి ఉండొచ్చు. అయినా సరే ప్రమోషన్ల బాధ్యతను నానితో సమానంగా భుజాన వేసుకుని హైదరాబాద్ తో మొదలుపెట్టి ముంబై, కోచి, బెంగళూరు, చెన్నై అంటూ అడిగిన ప్రతి చోటికి వెళ్లి అడిగినన్ని ఇంటర్వ్యూలు చాలా ఓపికతో ఇస్తూ నానికి బరువు తగ్గించే పని చేస్తోంది.ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం ఏంటంటే శ్రీనిధి శెట్టిలో ఉన్న చలాకీతనం, కామెడీ టైమింగ్ అన్నీ హిట్ 3 ప్రమోషన్లలో బయట పడుతున్నాయి. పద్ధతైన చీరలు, కాస్ట్యూమ్స్ తో అలరించుకుని వస్తున్న తీరు, నానితో కెమిస్ట్రీ, యాంకర్లతో మెలుగుతున్న విధానం ఇవన్నీ ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటున్నాయి. వీటికి తోడు హిందీ, తెలుగు, తమిళంలో అనర్గళంగా మాట్లాడుతున్న వైనం అభిమానులను మరింత దగ్గరగా చేస్తోంది. హిట్ 3 బ్లాక్ బస్టర్ అయితే ముందు పేరు వచ్చేది నాని, శైలేష్ కొలనుకి. ఆ తర్వాత విలన్ ఎవరనేదాన్ని బట్టి శ్రీనిధి శెట్టికి ఎంత క్రెడిట్ శాతం దక్కుతుందనేది మే 1 థియేటర్లలో చూశాక తేలుతుంది. అభినందించాల్సిన పాయింట్ మరొకటి ఉంది. చాలా ఓపికగా ఇన్నేసి ప్రమోషన్లలో హీరోయిన్లు పాల్గొనడం అరుదు. నాని హీరో కం నిర్మాత కాబట్టి ఎంత కష్టమైనా తనకు సంతోషంగానే ఉంటుంది. కానీ శ్రీనిధి శెట్టికి అలా కాదు. అయినా సరే ఇంత కమిట్ మెంట్ చూపించడం ఆకట్టుకుంటోంది.

# శర్వానంద్‌తో మరోసారి యంగ్ బ్యూటీ..

టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ప్రజెంట్ ఆయన 'నారి నారి నడుమ మురారి'మూవీలో నటిస్తున్నాడు. అలాగే దీనితో పాటు 'శర్వా-38'అనే మూవీలో కూడా నటిస్తున్నాడు. 1960లో తెలంగాణ - మహారాష్ట్ర బార్డర్‌లో జరిగే పిరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందబోతున్న ఈ మూవీకు సంపత్ నంది దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. అయితే ఎప్పటి నుంచో ఈ సినిమా అప్డేట్స్ కోసం శర్వా ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

ఈ క్రమంలో తాజాగా ఈ చిత్రం నుంచి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'శర్వా, సంపత్ బ్లడ్ ఫెస్ట్ కోసం బ్లాక్ బస్టర్ చార్మింగ్ కాంబో తిరిగి కలుస్తోంది.. ఈ ఉత్తేజకరమైన రైడ్ కోసం బృందం అద్భుతమైన ప్రతిభావంతులైన యంగ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్‌ను గర్వంగా స్వాగతిస్తుంది.. షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది' అని రాసుకొచ్చారు. కాగా శర్వానంద్-అనుపమ కాంబోలో వచ్చిన 'శతమానం భవతి' సినిమా ఎంతగా విజయం సాధించిందో మనందరికీ తెలిసిందే. ఇక పోస్టర్‌ను గమనించినట్లయితే.. మెడలో ఓ నల్ల దారం కట్టుకొని చెవులకు బుట్టాలు పెట్టుకుని, పంజాబీ డ్రెస్‌తో పాటు దుపట్టా కూడా కప్పుకొని ఒక మిడిల్ క్లాస్ అమ్మాయిలా కనిపిస్తుంది అనుపమ. అయితే పోస్టర్‌లో అనుపమను కేవలం హాఫ్ సైడ్ మాత్రమే కనిపించేలా చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టర్ సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటుంది.



# సమంత మాటల్లో అతడి గొప్పదనం



సమంత వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని ఉండొచ్చు. కొన్నేళ్లుగా ఆమె ఫిలిం కెరీర్ కూడా డౌన్ అయిపోయి ఉండొచ్చు. కానీ ఇండస్ట్రీలో ఆమెకు కొందరు గట్టి ఫ్రెండ్స్ ఉన్నారు. ఎలాంటి సమయంలో అయినా ఆమె కోసం వాళ్లు నిలబడతారు. ఓవైపు నాగచైతన్య నుంచి విడాకులు.. మరోవైపు మయోసైటిస్‌తో పోరాటం.. ఇలా సమంత వ్యక్తిగత జీవితంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నపుడు ఆ స్నేహితులే ఆమెకు అండగా నిలిచారు. అలాంటి స్నేహితుల్లో రాహుల్ రవీంద్రన్ ఒకడు. గాయని చిన్మయి సమంతకు క్లోజ్ ఫ్రెండ్ అన్న సంగతి తెలిసిందే.చిన్మయిని పెళ్లాడిన రాహుల్ సైతం సమంతకు క్లోజే. వీళ్లిద్దరూ కలిసి కొన్ని చిత్రాలకు పని చేశారు కూడా. రాహుల్ తన కోసం ఎంత బలంగా నిలబడతాడో చెన్నైలో జరిగిన ఒక అవార్డుల వేడుకలో ప్రత్యేకంగా ప్రస్తావించింది సమంత. ''నాకు ఆరోగ్యం బాగా లేనపుడు రాహుల్ నా వెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. అతను నాకు నా స్నేహితుడా.. సోదరుడా.. కుటుంబ సభ్యుడా.. రక్త సంబంధీకుడా అన్నది చెప్పలేను'' అని సమంత చెప్పుకొచ్చింది. ఈ వేడుకలో రాహుల్ సైతం పాల్గొన్నాడు. సోషల్ మీడియాలో సమంత మీద జరిగే ట్రోలింగ్‌ను తిప్పి కొట్టడంలో చిన్మయి, రాహుల్ ముందుంటారన్న సంగతి తెలిసిందే.



# థియేటర్లో హిట్... మరి ఒటిటిలో..

థియేటర్లో వచ్చినప్పుడు ఎల్2 ఎంపురాన్ కు జరిగిన హడావుడి అంతా ఇంతా కాదు. వివాదాలు చుట్టుముట్టాయి. కేంద్ర అధికార పార్టీని ఇబ్బంది పెట్టేలా కొన్ని పాత్రలు, సన్నివేశాలు ఉన్నాయనే కాంట్రావర్సి రేగింది. ఒక మతాన్ని టార్గెట్ చేసుకున్నారని సామజిక కార్యకర్తలు భగ్గుమన్నారు. నిరసనలకు భయపడి మోహన్ లాల్ ఏకంగా క్షమాపణ చెప్పి, అబ్జెక్షన్ వచ్చిన వాటికి కత్తిరింపులు వేసి, క్యారెక్టర్ల పేరు మార్చారు. మూడు వందల కోట్లకు పైగా వసూలు చేసి మల్లువుడ్ టాప్ గ్రాసర్ గా నిలిచిందని ఇటీవలే ప్రకటన ఇచ్చారు. నెల రోజుల తర్వాత ఇటీవలే ఎల్2 ఎంపురాన్ ఓటిటి స్ట్రీమింగ్ కి తీసుకొచ్చారు. ఇంత రచ్చ జరిగినప్పుడు సహజంగానే డిజిటల్ లో చూసే జనాలు అధికంగా ఉంటారు. కానీ ఎల్2 ఎంపురాన్ కు అలాంటి స్పందన కనిపించడం లేదు. దీనికా ఇంత బిల్డప్ ఇచ్చారనే కామెంట్స్ ఎక్కువగా వినిపించాయి. ఈ సినిమా మలయాళంలో మాత్రమే బాగా ఆడిరది. తెలుగుతో సహా ఇతర డబ్బింగ్ వెర్షన్లు డిజాస్టరయ్యాయి. ఇక్కడ పంపిణి చేసిన దిల్ రాజుకి ఏం మిగల్లేదు. కానీ ఎల్2 టీమ్ మాత్రం ప్రతి చోటా గొప్ప విజయం సాధించిందనే తరహాలో ప్రచారం చేసుకున్నారు. సాధారణంగా కేరళలో ఉన్న లేట్ ఓటిటికి ట్రెండ్ కి భిన్నంగా ఎల్2 ఇంత త్వరగా డిజిటల్ లోకి రావడం ఆశ్చర్యం కలిగించింది.ఇదంతా ఎలా ఉన్నా దర్శకుడు పృథ్విరాజ్ సుకుమారన్ మాత్రం ఎల్3 ది బిగినింగ్ తీస్తానని చెబుతున్నాడు. మోహన్ లాల్ కొడుకు ప్రణవ్ లాల్ ని హీరోగా పెట్టి లూసిఫర్ ఫ్లాష్ బ్యాక్ ని అందులో చూపించబోతున్నారు. ఎప్పుడు స్టార్ట్ అయ్యేది చెప్పలేదు కానీ వచ్చే ఏడాది ఉండొచ్చు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# కోల్‌కతా ఇన్నింగ్స్‌కు వర్షం

### రద్దు.. ఇరు జట్లకు చెరో పాయింట్

తాజా ఐపీఎల్‌లో తొలిసారి ఓ మ్యాచ్ వర్షా ర్పణమైంది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్‌కు వరుణుడు అడ్డు తగిలాడు. అయితే మొదట పంజాబ్ ఇన్నింగ్స్ సజావుగానే సాగింది. కానీ ఆ తర్వాత భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన కోల్‌కతా కేవలం ఒక ఓవర్ మాత్రమే ఆడగలిగింది. ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం ఆరంభం కావడంతో ఇరు జట్ల ఆటగాళ్లు పెవిలియన్‌కు చేరారు. వెంటనే పూర్తి మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచినా వర్షం మాత్రం తెరిపినివ్వలేదు. గంటన్నర వేచి చూసినా పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో రాత్రి 11 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ లభించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (49 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 83), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 69) మెరుపు అర్ధసెంచరీలు సాధించగా.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (25 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. వైభవ్ అరోరాకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో మ్యాచ్ ఆగే సమయానికి నైట్‌రైడర్స్ ఒక ఓవర్‌లో వికెట్ కోల్పోకుండా ఏడు పరుగులు సాధించింది.

**ఓపెనర్లు అదుర్స్:** టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్‌కు ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య అదిరే ఆరంభాన్నిచ్చారు. కెప్టెన్ నిర్ణయాన్ని వమ్ము చేయకుండా ఇన్నింగ్స్‌ను కదం తొక్కించారు. చక్కటి సమన్వయంతో పాటు ఇద్దరూ పోటాపోటీ బౌండరీలతో చెలరేగారు. అయితే 15 ఓవర్లలోనే 161 స్కోరుతో ఉన్న వేళ పంజాబ్ స్కోరు సులువుగా 220కి చేరుతుందనిపించింది. కానీ డెత్ ఓవర్లలో కోల్‌కతా పేసర్లు కట్టడి చేశారు. దీంతో జట్టు కష్టంగా 200 దాటగలిగింది. అంతకుముందు ప్రియాన్ష్ తొలి బంతినే ఫోర్‌గా మలిచి తన ఉద్దేశాన్ని చాటుకున్నాడు. నాలుగో ఓవర్‌లో ఆర్య 4,4.. ఐదో ఓవర్‌లో ప్రభ్ 4,6తో పవర్‌ప్లేలో జట్టు 56 రన్స్ సాధించింది. అలాగే హర్షిత్ ఓవర్‌లో ఆర్య వరుసగా 4,6,4తో 27 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. ఇక 11వ ఓవర్‌లో ప్రభ్ రెండు సిక్సర్లు, ఆర్య ఓ సిక్సర్‌తో స్పిన్నర్ నరైన్ 22 పరుగులిచ్చుకున్నాడు. ఓవర్‌కు 10 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళుతున్న ఈ జోడీకి రస్సెల్ చెక్ పెట్టాడు. 12వ ఓవర్‌లో ప్రియాన్ష్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆర్య నిష్క్రమించాక ప్రభ్‌సిమ్రన్ బ్యాట్ ఝుళిపించాడు. 13వ ఓవర్‌లోనే 4,4,6తో హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. స్పిన్నర్ వరుణ్ ఓవర్‌లో ప్రభ్ 4,4,6,4 బాదడంతో 19 పరుగులు వచ్చాయి. అయితే సెంచరీ ఖాయమనుకున్న వేళ పేసర్ వైభవ్ విసిరిన లో ఫుల్‌టాస్‌కు ప్రభ్ క్యాచ్ అవుటయ్యాడు. అయితే అప్పటికి ఓవర్‌కు 11 పరుగుల రన్‌రేట్‌తో పంజాబ్ దూసుకెళుతోంది. కానీ రస్సెల్, వైభవ్ డెత్ ఓవర్లలో కట్టడి చేశారు. ఈ సమయంలో మ్యాక్స్‌వెల్ (7), జాన్సెన్ (3) వికెట్లను సైతం కోల్పోయిన పంజాబ్ ఆఖరి ఆరు ఓవర్లలో చేసింది 43 పరుగులే. ఇక, శ్రేయాస్ క్రీజులోనే ఉన్నా భారీ షాట్లు ఆడలేకపోయాడు.












# ఏడాదికే కెరీర్ క్లోజ్

భారత క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి కీలక సలహా ఇచ్చాడు. వైభవ్ సూర్యవంశీ ప్రస్తుత ఐపీఎల్ (Iూా) 2025లో అరంగేట్రంతో అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కాడు. తన ఐపీఎల్ కెరీర్‌లోని మొదటి బంతికే సిక్స్ కొట్టడంతో టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారాడు. Iూా 2025 మెగా వేలంలో వైభవ్‌ను రాజస్థాన్ రాయల్స్ రూ. 1.1 కోట్లు చెల్లించి జట్టులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అతి చిన్న వయసులోనే ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేసి చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం వార్తల్లో నిలుస్తున్నాడు. ఈ 14 ఏళ్ల బాలుడు టీం ఇండియా స్టార్ ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ బంతిని సిక్స్ కొట్టడం ద్వారా తన ఐపీఎల్ కెరీర్‌ను ప్రారంభించాడు. చాలా మంది భారత దిగ్గజాలు ఈ చిన్నోడిపై ప్రశంసలు కురిపించాడు. చాలామంది అతన్ని టీం ఇండియా తదుపరి సూపర్ స్టార్ అని కూడా పిలుస్తున్నారు. అయితే, ఇప్పుడు దిగ్గజ భారత ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అతనికి ఒక కీలక సలహా ఇచ్చాడు. ఇది అతనికి ప్రారంభం మాత్రమే అంటూ సెహ్వాగ్ వైభవ్‌కు సలహా ఇచ్చాడు. ఈ ప్రారంభంతో వైభవ్ సంతోషంగా ఉండకూడదని అభిప్రాయపడ్డాడు. అతను ఎక్కువ కాలం ఆడాలని లక్ష్యంగా పెట్టుకోవాలంటూ సూచించాడు. ఇటీవల, క్రిక్‌బజ్‌లో మాట్లాడిన సెహ్వాగ్, 'మంచి ప్రదర్శనకు ప్రశంసలు అందుకుంటారని, బాగా రాణించనందుకు విమర్శలు వస్తాయని తెలుసుకోవాలి. మైదానంలోకి ప్రవేశిస్తే, ఎంతో కంట్రోల్‌గా ఉండాలి. ఒకటి లేదా రెండు మ్యాచ్‌లతో కీర్తి పొందిన చాలా మంది ఆటగాళ్లను నేను చూశాను. అప్పుడే వారంతా స్టార్ ప్లేయర్‌లు అయ్యారని భావిస్తే, అంతకన్నా పొరపాటు ఉండదు' అంటూ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ నుంచి నేర్చుకోవాలని సెహ్వాగ్ వైభవ్‌ను కోరాడు. 'విరాట్ కోహ్లీని చూడు' అంటూ చెప్పుకొచ్చాడు. 'కోహ్లీ 19 సంవత్సరాల వయసులో అరంగేట్రం చేశాడు. ఇప్పుడు 18 సీజన్లుగా ఆడుతున్నాడు. వైభవ్ ఈ లక్ష్యాన్ని మనసులో ఉంచుకోవాలి. కానీ, అతను తన మొదటి బంతికి సిక్స్ కొట్టి కోటి రూపాయలు సంపాదించడం వల్లే ఈ స్థానాన్ని సాధించానని అనుకుంటే, బహుశా అతను తరువాతి సీజన్‌లో ఆడలేకపోవచ్చు' అని హెచ్చరించాడు.




# ఆర్‌సీబీ కోచ్ పై మండిపడుతున్న కింగ్ కోహ్లీ!

ఐపీఎల్ 2025 సీజన్‌లో బెంగళూరులో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (Rజదీ) జట్టు రాజస్థాన్ రాయల్స్‌పై 11 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో ఒక ఆసక్తికరమైన దృశ్యం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. మ్యాచ్ మధ్యలో Rజదీ బ్యాటింగ్ కోచ్ దినేష్ కార్తీక్ మరియు ప్రధాన కోచ్ ఆండీ ఫ్లవర్ లాంగ్‌ఆన్ బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న విరాట్ కోహ్లీకి ఏదో సూచన ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే, కోహ్లీ ఆ సూచనను తిరస్కరించి, చేతులు ముడుచుకుంటూ తన అసహనాన్ని వ్యక్తపరిచాడు. ఈ దృశ్యం కెమెరాలకు చిక్కి సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అయింది. ఈ సంఘటనతో విరాట్ కోహ్లీ, దినేష్ కార్తీక్ మధ్య ఏదైనా విభేదాలున్నాయా అన్న ఊహాగానాలు మొదలయ్యాయి. కానీ మ్యాచ్ అనంతరం జరిగిన ప్రసంగంలో దినేష్‌కార్తీక్ మాత్రం కోహ్లీని ప్రశంసలతో ముంచెత్తాడు. Rజదీ డ్రెస్సింగ్ రూమ్‌లో మాట్లాడిన కార్తీక్, "మాటలు చెప్పడం కష్టం. అతనికి ఉన్న ఆకలి, నిబద్ధత అద్భుతమైనవి. 18 సంవత్సరాలు ఐపీఎల్ ఆడటం ఒక విషయం, కానీ అంతకాలం స్థిరంగా ప్రదర్శన ఇవ్వడం వేరే విషయం. కోహ్లీ తన దృష్టిని ఒక్క లక్ష్యంపై సారించగలడని, పరిస్థితులపై తనకు బలమైన అర్థం ఉందని ఇది చూపిస్తుంది" అని అన్నారు. అలాగే, "బెంగళూరులో జరిగిన మొదటి మూడు మ్యాచుల్లో అతను నాకు రెండు విషయాలు చెప్పాడు ఒకటి, అతను కొంత ఎక్కువ ఆలోచించి ఉండేవాడని, రెండవది అభిమానులు అతని బ్యాటింగ్ చూడటానికి మైదానానికి వస్తారన్న స్పష్టత అతనిలో ఉంది. అది అతని ప్రవర్తనలో స్పష్టంగా కనిపిస్తుంది" అని చెప్పారు. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 42 బంతుల్లో 70 పరుగులు చేయగా, దేవదత్ పడిక్కల్ 27 బంతుల్లో 50 పరుగులతో సహాయపడాడు. వీరిద్దరి మధ్య 95 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. ఆర్‌సిబి 20 ఓవర్లలో 205 పరుగులు చేసి మంచి స్కోరు నిలబెట్టింది. ప్రత్యర్థి రాజస్థాన్ రాయల్స్ చివరి దశలో విజయానికి సమీపించినప్పటికీ, ఆస్ట్రేలియన్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ వేసిన పెనాల్టిమేట్ ఓవర్‌లో రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ఆ ఓవర్‌తో ఆట గమనాన్ని ఆర్‌సిబి వైపు మళ్లించడంలో అతను కీలక పాత్ర పోషించాడు. ఈ విజయం Rజదీకి ఈ సీజన్‌లో హోం గ్రౌండ్ అయిన చిన్నస్వామి స్టేడియంలో వచ్చిన తొలి గెలుపు. గత మూడు మ్యాచ్‌ల్లో ఇదే వేదికపై ఓడిపోయిన ఆర్‌సిబి చివరకు హోమ్ గ్రౌండ్‌లో అభిమానుల ఎదుట విజయం సాధించి ఊపును అందుకుంది.

# అమ్మాయిలు.. రాణించండి

ఎఫ్ఐహెచ్ హాకీ లీగ్ స్వదేశీ అంచె పోటీల్లో మిశ్రమ ఫలితాలు సాధించిన హాకీ ఇండియా మహిళల జట్టు.. కంగారూ గడ్డపై కఠిన సవాల్‌కు సిద్ధమైంది. ఐదు మ్యాచుల సిరీస్‌లో పోటీపడేందుకు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన సలీమ టెటె సేన నేడు ఆస్ట్రేలియాఏతో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. శని, ఆదివారాల్లో ఆసీస్‌ఏతో తలపడనున్న భారత్.. ఆ తర్వాత కంగారూ సీనియర్ జట్టుతో ఢకొట్టెనుంది. పెర్త్ హాకీ స్టేడియం భారత్, ఆసీస్ సవాల్‌కు వేదిక కానుంది. ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో మిశ్రమ ఫలితాలు వచ్చినా.. వరల్డ్ నం.1 నెదర్లాండ్స్‌పై షూటౌట్‌లో విజయం సాధించటం భారత మహిళల జట్టులో ఆత్మ విశ్వాసం రెట్టింపు చేసింది. 26 మందితో ఆసీస్ వెళ్లిన సలీమ సేన.. సిరీస్ విజయమే లక్ష్యంగా ఆడనుంది. కెప్టెన్ సలీమ టెటె, వైస్ కెప్టెన్ నవనీత్ కౌర్‌లు జట్టును ముందుండి నడిపించనున్నారు. యంగ్ డ్రాగ్‌ఫ్లికర్ దీపిక, ఉదిత సింగ్‌లపై ప్రధానంగా ఫోకస్ ఉండనుంది. భారత గోల్స్ వేటలో దీపిక, ఉదితలు కీలక పాత్ర పోషించనున్నారు. సీనియర్ గోల్ కీపర్ సవిత కెరీర్ 300వ మ్యాచ్ ఆడనుంది. ప్రత్యర్థిని నిలువరించటంలో సవిత అనుభవం భారత్‌కు ఉపయుక్తం కానుంది. తొలిసారి జాతీయ జట్టులోకి వచ్చిన జ్యోతి సింగ్, సుజాత కుజుర్, అజ్మీనా కుజుర్, పూజ యాదవ్, మహిమ టెటెలు ఈ సిరీస్‌లో అరంగ్రేటం చేసే అవకాశాలు ఉన్నాయి.



# ఆర్‌సీబీ తో ఓటమిని తట్టుకోలేక...



ఐపీఎల్ 2025 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ బలమైన ఆరంభానికి తెరదించుకుని ఇప్పుడు తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఏప్రిల్ 24న బెంగళూరులో జరిగిన 42వ మ్యాచ్‌లో రాయల్స్ జట్టు ఆర్‌సిబి చేతిలో 11 పరుగుల తేడాతో ఓడిపోయింది. విజయం కోసం 206 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్, 8 ఓవర్లలోనే 99 పరుగులు చేసినప్పటికీ, చివరికి కేవలం 194/9 స్కోరు మాత్రమే చేసి పరాజయం పాలైంది. ఇది ఈ సీజన్‌లో రాజస్థాన్‌కు ఏడవ ఓటమి కావడం విశేషం, అలాగే వరుసగా ఐదవ పరాజయం కూడా కావడం వారి పరిస్థితిని మరింత దిగులుగా మార్చింది. ముఖ్యంగా, ఇది పరుగుల వేటలో వరుసగా మూడవ ఓటమి కావడంతో జట్టు తన పట్టును పూర్తిగా కోల్పోయినట్టు కనిపిస్తోంది. ఈ షాకింగ్ ఓటమి తర్వాత జట్టు సీఈఓ జేక్ లష్‌మెక్‌క్రమ్ బెంగళూరులోని ఒక ప్రసిద్ధ మద్యం దుకాణం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా కనిపించాడు. ఈ దృశ్యాన్ని ఓ అభిమాని కెమెరాలో బంధించి, "తన చింతలను తాగేందుకు వెళ్లాడు" అని సరదాగా వ్యాఖ్యానించాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతూ జట్టుపై ఉన్న ఒత్తిడిని ప్రదర్శిస్తోంది. మ్యాచ్ విషయానికి వస్తే, రాజస్థాన్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. కానీ ఆ నిర్ణయం ఫలితం ఇవ్వలేదు. విరాట్ కోహ్లీ మరియు దేవ్‌దత్ పడిక్కల్ అర్ధ సెంచరీలతో రన్‌ఫ్లో కొనసాగిస్తూ 205 పరుగులు చేశారు. బౌలర్లవైపు చూస్తే, రాయల్స్ దళం శ్రమించి కూడా ఆర్‌సిబి రన్‌ఫ్లోని అడ్డుకోలేకపోయింది. అనంతరం, రాయల్స్ బ్యాటింగ్‌కు దిగినపుడు ఓపెనర్ యశస్వి జైస్వాల్ 19 బంతుల్లో 49 పరుగులతో అద్భుత ఆరంభం ఇచ్చాడు. కానీ మరో ఓపెనర్ సూర్యవంశీ త్వరగా అవుటయ్యాడు. మొదటి ఎనిమిది ఓవర్లలో మ్యాచ్ రాజస్థాన్ చేతుల్లో ఉందనిపించింది, కానీ మిగతా బ్యాట్స్‌మెన్ జోష్ హాజిల్‌వుడ్ (433) మరియు కృనాల్ పాండ్యా (231) బౌలింగ్ ధాటికి నిలబడలేకపోయారు.ఇప్పటివరకు ఎనిమిది ఓటములతో రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇకపై జరిగే ప్రతి మ్యాచ్ వారికి మస్ట్ విన్ మ్యాచ్‌లుగా మారాయి. తదుపరి మ్యాచ్‌లో ఏప్రిల్ 28న గుజరాత్ టైటాన్స్‌ను ఎదుర్కొనబోతున్నారు. ఈ మ్యాచ్ జైపూర్‌లోని సవాయ్ మాన్సింగ్ స్టేడియంలో జరగనుంది. ఈ సమయంలో జట్టు మానసికంగా కూడా దెబ్బతిన్నందున, తదుపరి మ్యాచ్‌లో గెలిచి మళ్లీ పుంజుకోవాల్సిన అవసరం రాజస్థాన్ రాయల్స్‌పై తీవ్రంగా ఉంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in